

శాకంబరిగా కన్యకాపరమేశ్వరి

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 18 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఆషాడ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి, ఆలయానికి 10 టన్నుల కూరగాయలు, పండ్లతో వైభవంగా అలంకరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉభయకర్తలుగా శ్రీకన్యకాపరమేశ్వరి దేవస్థానం కమిటీ సభ్యులు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ కోటా గురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు శేగు షణ్ముగం, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, కోశాధికారి జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు మెమో 57ను అమలు చేయాలి

నెల్లూరు (విద్య), జూలై 18 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు మెమో 57ను అమలు చేసి పాత పెన్షన్ అమలు పరచాలని ఉపాధ్యాయుల ఫోరం నేతలు డిమాండ్ చేశారు. నగరంలోని కలెక్టరేట్ ఎదుట శుక్రవారం 2003 ఉపాధ్యాయుల ఫోరం నేతలు దర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1-9-2004 కంటే ముందు నోటిఫికేషన్ విడుదలై ప్రభుత్వ పరిపాలన కారణాలతో 2009, సెప్టెంబరు 1 తరువాత నియామకాలు పొం దిన ఉపాధ్యాయులకు, ఇతర ఉద్యోగులకు పాత పెన్షన్‌ను వర్తింప చేయాలన్నారు. దేశంలోని 16 రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో 57ను ఏపీలోనూ అమలు చేసి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. దర్నాకు అన్ని ఉపాధ్యాయ సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఈ నిరసనలో ఫోరం కన్వీనర్లు కృష్ణయ్య, ప్రసాద్, ఉపాధ్యాయ సంఘాల నేతలు చలపతిశర్మ, బాబురెడ్డి, దశరధరాములు, హజరత్, సుబ్బు, వేణుగోపాల్, పిచ్చిబాబు, అనిల్‌కుమార్, ఖాజా రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టిన ఉపాధ్యాయులు

801 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ

నెల్లూరు (వ్యవసాయం), జూలై 18 (ఆంధ్రజ్యోతి) : రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని శుక్రవారం 801 మెట్రిక్ టన్నుల యూరియాను జిల్లావ్యాప్తంగా వివిధ సొసైటీలు, రైతు సేవా కేంద్రాలకు తరలించినట్లు జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటికే 40వేల మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకాలు జరిగాయని పేర్కొన్నారు. బుచ్చి, అల్లూరు, దగదర్తి, ఇందుకూరుపేట, కలువాయి, కోవూరు నెల్లూరు, పొదలకూరు, టీపీ గూడూరు, వెంకటాచలం, వలేటివారిపాళెం మండలాల్లోని 18 సొసైటీలకు 317.475 మెట్రిక్ టన్నులు పంపామని తెలిపారు. అదేవిధంగా ఆత్మకూరు, అనంతసాగరం, చేజర్ల, కలువాయి, సంగం, బుచ్చి, పొదలకూరు, మనుబోలు మండలాల్లోని 28 రైతు సేవా కేంద్రాలకు 483.525 మెట్రిక్ టన్నులు మొత్తంగా 801 మెట్రిక్ టన్నులను రైతులకు అందుబాటులో ఉంచామని తెలిపారు.

స్థానిక సంస్థలకు ప్రాధాన్యత

- గత ప్రభుత్వంలోలా ఆర్థిక సంఘం నిధులు లాక్కోలేదు
- రూ.62.22 కోట్లు జమ చేశాం!
- గతంలో జడ్పీటీసీలు ఎందుకు ప్రశ్నించలేదు?
- అధికారులు సరైన సమాచారంతో రాకపోతే సహించేది లేదు
- జడ్పీ సర్వసభ్య సమావేశంలో మంత్రి ఆనం ఘాటు వ్యాఖ్యలు



జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం, పక్కన జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, కలెక్టర్ ఆనంద్, తదితరులు

నెల్లూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : 'గత పాలన తీరు వేరు. నేటి పాలన తీరు వేరు. ఈ ప్రభుత్వం స్థానిక సంస్థలకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. గతంలోలా పంచాయతీల నిధులను లాగేసుకోవడం లేదు. ఏడాది కాలంలో జిల్లాలో స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన రూ.62.22 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం నేరుగా స్థానిక సంస్థల ఖాతాల్లో జమ చేసింది' అని రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన శుక్రవారం నెల్లూరులోని జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశానికి మంత్రి ఆనం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జడ్పీ మాజీ చైర్మన్ బాలచెన్నయ్య మృతికి సంతాపం ప్రకటించారు. అనంతరం అరుణమ్మ సమావేశాన్ని ప్రారంభించగా, పంచాయతీ రాజ్, డ్వామా, డీఆర్‌డీఏ, విద్యా, విద్యుత్ శాఖలపై సమీక్ష జరిగింది. పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు తమ ప్రాంతాల్లోని సమస్యలను ప్రస్తావించారు. 30 నెలలుగా గౌరవ వేతనం ఇవ్వలేదని, జడ్పీ జనరల్ ఫండ్ కింద ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యేలు కూడా పలు అంశాలపై మాట్లాడటంతో వాటిని పరిష్కరించాలని మంత్రి, కలెక్టర్ జిల్లా అధికారులను ఆదేశించారు. చివరగా మంత్రి ఆనం మాట్లాడుతూ.. గౌరవ వేతనాన్ని జనరల్ ఫండ్ కింద చెల్లించి, తిరిగి రీయింబర్స్ చేసుకునే అవకాశం ఉన్నా జడ్పీ అధికారులు ఎందుకు అలా చేయలేదని ప్రశ్నించారు. ఇప్పుడు గౌరవ వేతనం గురించి మాట్లాడుతున్న జడ్పీటీసీలు.. గత ప్రభుత్వంలో సర్పంచ్‌ల నిధులు, అధికారాలు లాగేసుకున్నప్పుడు ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. తాము స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని అనుకుంటే, వారికి సమాధానం కూడా అంతే కరుగ్గా వస్తుందని ఆనం వ్యాఖ్యానించారు. జిల్లాస్థాయి సమావేశాలకు అధికారులు సమగ్ర సమాచారంతో రావాలని, ఇకపై అలా రాకపోతే ఉపేక్షించేది లేదని కలెక్టర్‌కు సూచించారు. గత ప్రభుత్వ పుణ్యమా అంటూ రాష్ట్రంలో జలజీవన్ మిషన్ పనులు రద్దయ్యే ప్రమాదం వచ్చిందని, కానీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో మాట్లాడి మరో రెండేళ్ల సమయం పొడగించుకున్నారని మంత్రి వెల్లడించారు.



ఖాళీగా ఉన్న ఎమ్మెల్యేల కుర్చీలు

కుదరదు.. ఇవ్వాల్సిందే..

వెంకటగిరి నియోజకవర్గంలో నిర్మిస్తున్న ఎంపీడీవో కార్యాలయ భవనాల విషయంలో ఆసక్తికర చర్చ జరిగింది. గతంలో వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి, సైదాపురం మండలాల్లో శిథిలావస్థలో ఉన్న ఎంపీడీవో కార్యాలయాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించేందుకు జడ్పీ నిధులతో అనుమతులు మంజూరు చేశారని, వాటిలో కొన్ని అసంపూర్తిగా ఉన్నాయని ఆయా జడ్పీటీసీ సభ్యులు ప్రస్తావించారు. మిగిలిన నిధులు మంజూరు చేస్తే భవనాలు పూర్తవుతాయని కోరారు. కానీ వీరి విన్నపాన్ని చైర్‌పర్సన్ అరుణమ్మ తిరస్కరించారు. నిధులు ఇవ్వడం సాధ్యం కాదని తేల్చి చెప్పారు. అయితే నిధులు ఇవ్వలేం అనడం సరైన సమాధానం కాదని మంత్రి ఆనం అన్నారు. పెండింగ్ నిధులను విడుదల చేయాలని ఆదేశించారు. అలానే ఇంతకాలం ఆ భవనాలను ఎందుకు పూర్తి చేయలేకపోయారో కలెక్టర్‌కు వివరణ పంపాలని జడ్పీ సీఈవోకు సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉదయగిరి ఎమ్మెల్యే సురేష్

లోకేష్‌కు ధన్యవాదాలు

పేద విద్యార్థుల కోసం తల్లికి వందనం గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విద్యాశాఖ

- మిగతా 7లో

కాంట్రాక్ట్ అధ్యాపకుల గడువు పునరుద్ధరణ

- వివరాలు 8లో

6 నెలల్లో గ్రంథాలయ సెస్సులు చెల్లించాలి

మున్సిపల్ కమిషనర్లకు జేసీ ఆదేశాలు

నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రంథాలయ సంస్థకు మున్సిపాలిటీలు చెల్లించాల్సిన సెస్సు బకాయి రూ.40కోట్లను 6 నెలల్లో పూర్తిగా చెల్లించాలని జిల్లాలోని మున్సిపాలిటీల కమిషనర్లను గ్రంథాలయ చైర్‌పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ ఆదేశించారు. శుక్రవారం ఆయన జిల్లా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారులు, సిబ్బందితో సమీక్ష జరిపారు. వారి సమస్యలు, గ్రంథాలయ పరిస్థితులు, జీతభత్యాలు, పెన్షన్లు తదితర అంశాలపై చర్చించారు. సెస్సు బకాయిలపై మున్సిపల్ కమిషనర్లతో మాట్లాడారు. ఇక నుంచి ప్రతీ సోమవారం జిల్లా పంచాయతీ అధికారి, కమిషనర్లతో గ్రంథాలయ సెస్సులపై సమీక్ష జరుగుతుందని చెప్పారు. శాఖ గ్రంథా లయ అవసరాలపై నివేది కలు ఇవ్వాలని సంబంధిత అధికారులకు సూచించారు. పాఠకుల అవస రాలకు అనుగుణంగా గ్రంథాలయాలను తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు. జిల్లా గ్రంథా లయ సంస్థ నూతన భవన నిర్మాణాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా కార్యదర్శి కుమార్‌రాజా, డిప్యూటీ లైబ్రేరియన్ సునీత, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇవి ఇంతేనా!?

- రైతు సేవా కేంద్రాల్లో మూలకు కియోస్క్ యంత్రాలు
- వైసీపీ హయాంలో ఏర్పాటు.. రూ.3.75 కోట్ల ఖర్చు
- అధికారులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగం

సంగం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో రూ.కోట్ల ప్రజాధనం దుర్వినియోగమైంది. రైతులకు నాణ్యమైన సేవలందిస్తామని చెప్పి రైతు భరోసా కేంద్రాలు (ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలు) ఏర్పాటు చేశారు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు రాయితీపై రైతులు కొనుగోలు చేసేందుకు వీలుగా వీటిలో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాలు ఇప్పుడు మూలకు చేరాయి. వీటి వినియోగంపై అధికారులు కూడా పట్టించుకున్న దాఖలాలు లేవు.

561 సచివాలయాల్లో ఏర్పాటు

జిల్లాలో 722 పంచాయతీలు ఉండగా 561 సచివాలయాల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేశారు. అధికారులు, వ్యవసాయ సిబ్బంది సహకారంతో రైతులు తమకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలను కియోస్క్ యంత్రాల ద్వారా నమోదు చేసుకోవచ్చు. ఆ తర్వాత నేరుగా రైతుల ఇంటికే వాటిని సరఫరా చేస్తారు. మార్కెట్లో పంటల ధరలు, వాతావరణ మార్పులు తదితర విషయాలను రైతులు తెలుసుకునే సౌలభ్యమూ ఉంటుంది. కానీ, గత ప్రభుత్వం యంత్రాలను ఏర్పాటు చేసిందే తప్ప రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను మాత్రం అందుబాటులో ఉంచకపోవడంతో యంత్రాలు నిరుపయోగంగా మారాయి.

రూ.3.75 కోట్ల ఖర్చు

వైసీపీ హయాంలో కియోస్క్ యంత్రాలను కొనుగోలు చేసి అన్ని ఆర్బీకేల్లో ఏర్పాటు చేశారు. కానీ, క్షేత్రస్థాయిలో రైతులకు ఈ యంత్రాలపై అవగాహన కల్పించకపోవడంతో వీటిని వినియోగంచలేకపోయారు. ఒక్కో యంత్రానికి సుమారు రూ.67 వేలు వంతున 561 కియోస్క్ యంత్రాలకు రూ.3.75 కోట్లు ఖర్చు చేశారు. అందులో భాగంగా సంగం మండలంలోని 13 ఆర్బీకేలకుగాను 12 ఆర్బీకేలకు సరఫరా చేశారు. కొన్ని కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో వీటిని పంచాయతీ కార్యాలయాల్లో ఉంచారు. చాలా కేంద్రాల్లో యంత్రాలకు ఇంటర్నెంట్ సౌకర్యం కల్పించకపోవడంతో అవి కాస్తా మూలకు చేరాయి. ఇంకొన్ని చోట్ల వ్యవసాయ, పశుసంవర్ధక, ఉద్యానశాఖ అధికారులు, సహాయకులు వారి ఫోన్లలో వైఫై ద్వారా ప్రారంభంలో యంత్రాలను వినియోగించారు. ఆ తరువాత రెండేళ్లుగా వాటిని పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కియోస్క్ యంత్రాలను వినియోగంలోకి తేవాలని రైతులు కోరుతున్నారు.



సంగం పంచాయతీ కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న కియోస్క్ యంత్రాలు

కీలక పోస్టులకు ఇన్‌చార్జులే దిక్కు!

- విద్యాశాఖలో ఖాళీగా ముఖ్య స్థానాలు
- అంతంత మాత్రంగా పర్యవేక్షణ
- విద్యా రంగ ఉన్నతిపై తీవ్ర ప్రభావం

బడిలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పరిశీలన కొరవడింది. పర్యవేక్షించాల్సిన యంత్రాంగం పనిభారంతో కునారిల్లుతోంది. పాఠాలు బోధించాల్సిన గురువులు నిత్యం పలు రకాల నివేదికల సమర్పణలో సతమతం అవుతుంటే అదనపు బాధ్యతల ఒత్తిళ్లలో పర్యవేక్షణాధికారులు ఉంటున్నారు. కీలకమైన నెల్లూరు, కావలి, కందుకూరు, ఆత్మకూరు డిప్యూటీ డీఈఓలుగా ఎంఈఓలే ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తున్నారు. పరిపాలన సౌలభ్యం కోసం ఎంఈఓలను రెండు విభాగాలుగా చేసి ఎంఈఓ-1, ఎంఈఓ-2లు నియమించారు. ఎంఈఓ-1 టీచర్ల జీతాలు, ప్రైవేట్ పాఠశాలల అనుమతులు, నిర్వహణ, విద్యాపరమైన అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. ఎంఈఓ-2 ప్రభుత్వ పథకాలు అయిన తల్లికివందనం, మనబడి నాడు నేడు, మధ్యాహ్న భోజన తదితర అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. అయితే ఎంఈఓ-2లు రెగ్యులర్‌గా పనిచేస్తుండగా, ఎంఈఓ-1లు మాత్రం జిల్లావ్యాప్తంగా ఉన్న 38 మండలాల్లో 20 మంది ఎఫ్‌ఏసీలుగా వ్యవహరిస్తున్నారు.

- వివరాలు 8లో..

'సోమశిల'కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

అనంతసాగరం జూలై 18 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వరద కొనసాగుతోంది. శుక్రవారం 2,603 క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం డ్యాంలో 27.800 టీఎంసీల నీరు నిల్వ ఉండగా ఉత్తర కాలువకు 375, దక్షిణ కాలువకు 400, పెన్నాడెల్టాకు 3,750 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.



రేపు చాముండేశ్వరీదేవికి శాకంబరి అలంకారం

ఇందుకూరుపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గంగపట్నంలో వెలసిన శ్రీచాముండేశ్వరి అమ్మవారికి ఈనెల 20న వివిధ రకాల కూర గాయలు, పండ్లతో శాకాంబరి అలంకారం నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి తాతా శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 22న మంగళవారం ఉదయం 9 గంటలకు శ్రీఅమ్మవారికి ఆషాఢ మాస సారెను మహిళలు సమర్పిస్తారన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9423
వెండి కిలో ధర	రూ. 116200
వెండి ఒక గ్రాము	రూ. 119.20

మద్యం తాగి డ్రైవ్ చేస్తే కఠిన చర్యలు

కొడవలూరు ఎస్‌ఐ కోటిరెడ్డి



?. చోరీలు జరగకుండా ఎలాంటి చర్యలు చేపట్టారు.

!. మండలంలోని అన్ని గ్రామాల్లో రాత్రి సమయంలో ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేస్తున్నాం. ఎలాంటి చోరీలూ జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

?. రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

!. ప్రతి వాహన చోదకుడూ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. ముఖ్యంగా హెల్మెట్ ధరించాలి. ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నాం.

?. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిని ఎలా నియంత్రిస్తారు.

!. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవు. తరుచూ డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్నాం.

?. సీసీ కెమెరాలు సక్రమంగా పని చేస్తున్నాయా.

!. సీసీ కెమెరాలు అన్ని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేశాం. నేరస్తులను పట్టించడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి.

- కొడవలూరు, (ఆంధ్రజ్యోతి)

యూరియా కొరత.. రైతన్నల వెత!

- 20 వేల ఎకరాల సరిపడా వచ్చిన యూరియా
- 3 కోటాలకు సరిపడా సర్దుకున్న పెద్ద రైతులు
- పరిసర మండలాల రైతులకూ పంపిణీ
- మండలంలో చిన్న, సన్నకారు రైతులకు వెతలు



వవ్వేరు కోఆపరేటివ్ బ్యాంకు సొసైటీలో యూరియా లేక మూతపడిన గోడౌన్లు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం మండలంలో తీవ్రమైన యూరియా కొరతతో రైతులకు వెతలు తప్పడం లేదు. బుచ్చి మండలంలో బుచ్చి, వవ్వేరు, రెడ్డిపాళెం, దామరమడుగుతో పాటు మొత్తం 4 సొసైటీలు వున్నాయి. కాగా రెడ్డిపాళెం, వవ్వేరు బ్యాంకు సొసైటీలలో సోమవారం నుంచే యూరియా కొరత ఏర్పడడంతో ఆ గోడౌన్లు మూతపడ్డాయి. బుచ్చి, దామరమడుగు సొసైటీలలో వున్న అరకొర యూరియా బుధవారం ఉదయంతో అక్కడ గోడౌన్లు కూడా ఖాళీ అయ్యాయి. దీంతో మండలంలో యూరియా అవసరమైన రైతులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. మండలంలో అధికారికంగా 10వేల ఎకరాలు ఉండగా, అనధికారికంగా మరో 3వేల ఎకరాలుంది. అంటే మొత్తం 13వేల ఎకరాల మేర వరిసాగు చేసేంత భూమి వుంది. రైతాంగం వరి నాటిన దగ్గర్నుంచి ఎన్ను తీసే వరకు ఎకరాకు 3 కట్టల వంతున యూరియా వినియోగిస్తారు. ఈ మేరకు 13వేల ఎకరాలకు మొత్తం సుమారు 40 వేల యూరియా కట్టలు రైతాంగానికి అవసరం. ఐతే ఇప్పటి వరకు మండలానికి 20వేల ఎకరాలకు సరిపడా యూరియా దిగుమతి అయిందని మండల వ్యవసాయాధికారి శ్రీహరి తెలిపారు.

● **చిన్న, సన్నకారు రైతులకు వెతలు**

మండలంలో రైతాంగానికి సరిపడా వచ్చిన యూరియాను పెద్ద రైతులు, కొంతమంది మధ్య తరగతి రైతులు 3 కోటాలకు సరిపడా తెచ్చుకున్నారు. ఐతే వ్యవసాయానికి పెట్టుబడి పెట్టుకోలేని చిన్న, సన్నకారు రైతులు అప్పులు చేసి తీరా యూరియా కోసం వచ్చేసరికి వున్న యూరియానంతా పరిసర మండలాలు దగదర్తి, సంగం, నెల్లూరు రూరల్, కోవూరు తదితర మండలాల రైతులు తన్నుకుపోయారు. దీంతో మండలంలో వెనుకచిక్కి నాట్లు వేసిన రైతులు, చిన్న, సన్నకారు రైతులు యూరియా కోసం గత 2 రోజులుగా సొసైటీలు, ప్రైవేటు దుకాణాల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోతోంది. దీంతో మండలంలో యూరియా కొరత దుమారం రేపుతోంది. ఈ విషయంపై మండల వ్యవసాయాధికారి శ్రీహరి మాట్లాడుతూ రెండు, మూడు రోజుల్లో ఆర్‌పీఎఫ్ ద్వారా మండలానికి యూరియా వస్తుందని తెలిపారు. ఈసారి నుంచి యూరియా కోసం రైతులు క్యూలో కూడా నిలబడకుండా యూరియా కొరతను అధిగమించేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

ముందు జాగ్రత్త లేకనే...

రెండోపంటకు నీళ్లు ఇస్తామని ప్రకటించిన అధికారులు ఎన్ని వేల ఎకరాలు వేస్తున్నారు, యూరియా అవసరం ఎంత వుందనే విషయంపై దృష్టి సారించలేదు. ఈమేరకు జిల్లా వ్యవసాయ యంత్రాంగం ప్రభుత్వానికి నివేదిక పంపించాల్సివుంది. దీనికితోడు ఈ సారి రెండో కారు అనుకున్న దానికన్నా ఎక్కువగా వరినాట్లు సాగు చేశారు. ఐతే ఎక్కడ విఫలమౌతున్నారో అర్థం కావడం లేదు. ఎరువుల లోడు వస్తే జిల్లాలో రైతాంగం అక్కడికి పరుగులు తీస్తూ ఎరువులు తరలించుకుపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో యూరియా కొరత ఏర్పడుతోంది.

- ఆకుల వెంకటస్వామి, రైతు, రేబాల

డెంగ్యూ వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ హుస్సేనమ్మ తదితరులు

వెంకటాచలం, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : డెంగ్యూ వ్యాప్తి చెందకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారిణి డాక్టర్ హుస్సేనమ్మ సూచించారు. వెంకటాచలంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం జాతీయ డెంగ్యూ మాసోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. దోమల ద్వారా వచ్చే వ్యాధులను లార్వా దశలోనే అరికట్టాలన్నారు. ప్రతీ శుక్ర వారం నిల్వ ఉన్న నీటిని శుభ్రపరిచి పట్టుకోవడం మంచిదన్నారు. దీని ద్వారా దోమ గుడ్డు దశలోనే చనిపోతుందన్నారు. దోమలు కుట్టకుండా దోమల తెరలు, కిటికీలకు మెష్‌లు వంటివి ఏర్పాటు చేసుకోవాలన్నారు. కసుమూరు వైద్యాధికారి డాక్టర్ ప్రవల్లిక మాట్లాడుతూ కలుషిత నీటి ద్వారా అతిసార, టైఫాయిడ్ వంటి జ్వరాలు ప్రబలుతాయని, కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కల్పన, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు లత, సబ్ యూనిట్ అధికారి సుధాకర్ రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లేగదూడలకు అందాల పోటీలు



బహుమతులు అందజేస్తున్న డీడీ, టీడీపీ నాయకులు

మనుబోలు, జూలై 18(ఆంధ్రజ్యోతి): అతివల అందాల పోటీల తరహాలోనే పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం చెర్లోపల్లిలో లేగదూడలకు అందాల పోటీలు నిర్వహించారు. పెయ్యదూడల ఉత్పత్తి పథకంలో భాగంగా పశుసంవర్ధకశాఖ ద్వారా అందించిన సెమెన్‌తో చెర్లోపల్లిలో 45 పెయ్య దూడలు పుట్టాయని మనుబోలు ఏడీ గురవారెడ్డి తెలిపారు. దూడలను పాడి రైతులు అందాల పోటీలకు తీసుకురాగా, వాటిలో మూడు దూడలను ప్రత్యేక బహుమతులకు ఎంపిక చేశారు. డీఎల్‌డీవో నాగమణి, చీఫ్ సూపరిండెంట్ శ్రీనివాసరావు లేగదూడల యజమానులకు బహుమతులు అందించారు. దూడలు, గేదెల పోషణలో యాజమాన్య పద్ధతులు గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కలికి వేణుగోపాల్ రెడ్డి, పొన్నూరు అశోక్, శేఖర్‌రెడ్డి, అల్లూరు సుమన్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

రాపూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్ పర్సన్‌గా ఆవుల వాణి

రాపూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాపూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్‌పర్సన్‌గా సైదాపురం మండలానికి చెందిన ఆవుల వాణిని రాష్ట్ర ప్రభుత్వం గురువారం నియమించింది. ఈ సందర్భంగా ఆమె ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు కృతజ్ఞతలు తెలియజేశారు.



ఆవుల వాణి

పాఠశాల తరలింపుపై తల్లిదండ్రుల నిరసన



ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి నాయకులు

సైదాపురం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతేగుంట అరుంధతీయవాడ ప్రాథమిక పాఠశాల వద్ద వి ద్యార్థుల తల్లిదండ్రులతో కలసి ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి నాయకులు శుక్రవారం నిరసన చేప ట్టారు. ఈ సందర్భంగా నాయ కులు మాట్లాడుతూ అరుంధతీయవాడలో 30 సంవత్సరాలు గా పాఠశాల ఉందన్నారు. 160 కుటుంబాలు ఉండగా 28 మంది విద్యా ర్థులు స్థానిక ప్రాథమిక పాఠశాలలో చదువుతు న్నారన్నారు. మోడల్ స్కూల్ పేరుతో కి.మీ దూరంలో ఉన్న పాఠశాలకు విద్యార్థులను తరలించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు నిర సన వ్యక్తం చేశారు. అరుంధతీయ వాడలోనే పాఠశాలను కొనసాగించాలని డిమాండ్ చేశా రు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నా యకుడు మందా వేంకటేశ్వరరావు మాదిగ, రాష్ట్ర నాయకుడు గోచిపాతల వెంకటేశ్వర్లు మాదిగ, జిల్లా నాయకులు పందిటి అంబేద్కర్ మాదిగ, సూరిపాక ఉదయ్ మాదిగ తదిత రులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూముల పరిశీలన



భూములను పరిశీలిస్తున్న అధికారులు

సైదాపురం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మొలకలపూండ్ల రెవెన్యూ గ్రామం గద్దలకొండ వద్ద ఆక్రమణలో ఉన్న కొండ పోరంబోకు భూములను శుక్రవారం రెవెన్యూ, అటవీశాఖ, ఉద్యానవన శాఖాధికారులు పరిశీలించారు. తహసీల్దార్ సుభద్ర మాట్లాడుతూ కొండ పో రంబోకు భూముల్లో అనుమతులు లేకుండా నిమ్మ, జామాయిల్ సాగు చేస్తున్న భూము లను గుర్తించి ఉన్నతాధికారులకు నివేది కలు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ఉద్యా నవన శాఖాధికారి ఆనంద్, అటవీశాఖ బీట్ ఆఫీసర్ రవిశేఖర్, ఆర్‌ఐ ప్రదీప్ కుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన

మనుబోలు, జూలై 18(ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేడ్కర్ నగర్‌లో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవాలయంలో శుక్రవారం సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో మూడురోజుల పాటు ఉపన్యాసం, భజనలు నిర్వహించారు. సామూహిక కుంకుమార్చనకు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అనంతరం తితిదే సిబ్బంది సంకీర్తనలు ఆల పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

జొన్నవాడలో అర్చకుడి మృతి

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జొన్నవాడ శ్రీ మల్లికార్జున స్వామి, కామాక్షితాయి ఆలయ (మిరాశీ) అర్చకుడు బండారం బాలసుబ్రహ్మణ్యం అంత్యక్రియలు శుక్రవారం ఆలయ మర్యాదలతో జరిగాయి. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారు. ఈఓ ఏవీ శ్రీనివాసులురెడ్డి అర్చకుడి మృత దేహానికి నివాళులర్పించారు. అంత్యక్రియల్లో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయ విమర్శలు వద్దు

విడవలూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): కోవూరు నియోజకవర్గంలో రాజకీయ విమర్శలకు టీడీపీ, వైసీపీ పెద్దలు జోక్యం చేసుకుని అడ్డుకట్ట వేయాలని చౌకిచర్ల గ్రామ ఆదర్శ రైతు పోలంరెడ్డి అశోక్ రెడ్డి సూచించారు. శుక్రవారం విలేకర్ల సమావేశం లో అయన మాట్లాడుతూ కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డిల వ్యవహారం గ్రామాల్లో గొడవలకు ఆజ్యం పోస్తోందన్నారు. రాజకీయ విమర్శలకు చరమ గీతం పాడాలన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

ఏఎస్ పేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): చిరమన జడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు కంచర్ల శేషయ్యనాయుడు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ నిర్వాహకులు అంకయ్య నాయుడు శుక్రవారం సన్మానించారు.

పేద విద్యార్థులకు అండగా సోమిరెడ్డి ఫౌండేషన్



బహుమతులు అందజేస్తున్న మల్లికార్జున

ముత్తుకూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి నియో జకవర్గ సమన్వయకర్త సోమి రెడ్డి రాజగోపాల్ రెడ్డి, శృతి రె డ్డిలు ఏర్పాటు చేసిన సోమి రెడ్డి ఫౌండేషన్ పేద విద్యార్థు లకు అండగా నిలుస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు నీలం మల్లికార్జున యా దవ్ తెలిపారు. ముత్తుకూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పదో తరగతి ఫలితాలలో ప్రథమ స్థానం సాధించిన నాగమౌనికకు రూ. 10 వేలు, ద్వితీయ స్థానం సాధించిన శ్రీలేఖకు రూ. 5 వేల నగదును సోమిరెడ్డి ఫౌండేషన్ తరఫున అంద జేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు రెడ్డి, టీడీపీ నాయకులు అబ్దుల్ షఫీవుల్లా, అక్కయ్యగారి ఏడుకొండలు, సుంకర శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలను తెలుసుకుంటున్న జనసేన నాయకుడు బొబ్బేపల్లి

తోటపల్లిగూడూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గిరిజన సమస్యల పరిష్కారానికి జనసేన పార్టీ తరఫున కృషి చేస్తామని జనసేన పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు పేర్కొన్నారు. కోడూరు గిరిజన కాలనీలో శుక్రవారం పర్యటించి గిరిజనుల సమస్యలు తెలుసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో గిరిజనుల ఓట్లతో గెలిచిన ప్రజా ప్రతినిధులు వారి సమస్యలను పరిష్కరించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సర్వేపల్లి నియోజకవర్గంలో 117 పంచాయతీల్లోని గిరిజన కుటుంబాలకు అండగా ఉంటూ, వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ వాణి, భవానీ, శ్రీహరి, కొండూరు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కాలువ ఆక్రమించి ఇల్లు కడుతున్నారని ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

మనుబోలు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పంటకాలువ ఆక్రమించి ఇల్లుకట్టేస్తున్నారంటూ మనుబోలు రైతులు శుక్రవారం ఆందోళన చేశారు. అంబేడ్కర్ నగర్ వద్ద నుంచి 1200 ఎకరాలకు సాగునీరు అందించే పంటకాలువ వెళుతుందని రైతులు పేర్కొన్నారు. పంటకాలువ స్థలం ఆక్రమించి కాలనీకి చెందిన ఓ మహిళ పిల్లర్లు వేసి ఇల్లు నిర్మిస్తోందన్నారు. కాలువకు ఇరుపక్కల సిమెంట్ బండ కట్టించాలని ఇప్పటికే ఇరిగేషన్ అధికారులను కోరామని వారు తెలిపారు. భవిష్యత్తులో కాలువకు బండ కట్టాల్సివస్తే ఆక్రమణలు తొలగించాల్సివస్తుందన్నారు. తీరా అప్పుడు ఇబ్బంది పడకుండా ముందు గానే ఇల్లుకట్టవద్దని హెచ్చరించినా వినడం లేదన్నారు. దీనిపై ఇరిగేషన్ అధికారులు స్పందించి పంటకాలువ స్థలం ఆక్రమణకు గురి కాకుండా కాపాడాలని రైతులు కోరారు.

C.R.I.M.E N.E.W.S

కట్టుకున్నోడినే కడతేర్చిన ఇల్లాలి అరెస్ట్

- ప్రియుడు కూడా కటకటాలపాలు
- వివాహేతర సంబంధంతోనే దారుణం
- 24 గంటల్లోనే కేసును ఛేదించిన రాపూరు పోలీసులు

రాపూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ప్రియుడి మోజులో పడి కట్టుకున్నోడినే కడతేర్చిన ఇల్లాలు చివరికి కటకటాలపాలైంది. రాపూరులో హత్య జరిగిన 24 గంటల్లోనే కేసును పోలీసులు ఛేదించారు. మృతుడి భార్యతోపాటు ప్రియుడిని అరెస్ట్ చేసినట్లు రాపూరు సీఐ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం సాయంత్రం రాపూరు పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఈ హత్య పూర్వాపరాలను సీఐ వెల్లడించారు.

రాపూరు దళితవాడలో ఉంటున్న లేబాకు శీనయ్య భార్య ధనమ్మకు పంగిలి గ్రామానికి చెందిన కునిపాక కల్యాణ్ మధ్య వివాహేతర సంబంధం ఉంది. తమ కలయికకు అడ్డుగా ఉన్నాడన్న నెపంతో శీనయ్యను హతమార్చాలని పన్నాగం పన్నారు. ఈ మేరకు బుధవారం రాత్రి శీనయ్య పూటుగా మద్యం సేవించి ఇంట్లో పడుకుని ఉండగా, ధనమ్మ తన ప్రియుడు కల్యాణ్‌కు ఫోన్ చేసి తెలిపింది. తాడు, ఆటో గేర్ వైర్‌ను తీసుకుని కల్యాణ్ ఇంటికి చేరుకున్నాడు. శీనయ్యను ఇద్దరు కలిసి కాళ్ళు, చేతులు తాడుతో కట్టి నోట్లో గుడ్డను కుక్కి, ఆటో గేర్ వైర్‌తో మెడకు గట్టిగా బిగించి ఊపిరాడకుండా చంపేశారు. హత్యకు వినియోగించిన తాడు, ఆటో గేర్‌వైర్, గుడ్డను తగలబెట్టారు. శీనయ్య మరణాన్ని సహజ మరణంగా సృష్టించేందుకు గురువారం ఉదయం మృతుడి తల్లిదండ్రులకు శీనయ్య ఇంటిలో మద్యం తాగి తన తలను తలుపునకు, గోడకు కొట్టుకొని పడిపోయాడని నమ్మించేందుకు ప్రయత్నించింది. అయితే, కుమారుడి మరణంపై అనుమానంతో వారు ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు మృతుడి భార్య ధనమ్మను విచారించగా, అసలు విషయం బయటపడిందని చెప్పారు. నిందితులిద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించిన రాపూరు ఎస్‌ఐ వెంకట్ రాజేష్, కండలేరు డ్యాం ఎస్‌ఐ డి.రామకృష్ణ, పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు.

కారు బోల్తా : వీఆర్వోకు తీవ్ర గాయాలు

దుత్తలూరు (ఉదయగిరి), జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమలరేగడ గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వీఆర్వోకు తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల మేరకు.. ఉదయగిరి-2 వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న హజరత్‌మస్తాన్ విధులు ముగించుకుని స్వగ్రామమైన వరికుంటపాడు మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి తన బైక్‌పై బయలుదేరాడు. ఈ తరుణంలో సోమలరేగడ గ్రామ సమీపానికి రాగానే రోడ్డుపై గేదెలు అడ్డురావడంతో వాటిని ఢీకొని కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. అలాగే ఉదయగిరి పట్టణానికి చెందిన షేక్ మస్తాన్ తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో బుచ్చికి వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా అదే ప్రదేశంలో రోడ్డుపైకి ఆకస్మాత్తుగా గేదెలు రావడంతో వాటిని తప్పించబోయి కారు అదుపుతప్పి రోడ్డుపక్కనే ఉన్న గుంతలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మస్తాన్‌తోపాటు కుటుంబ సభ్యులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 వాహనానికి సమాచారం అందించడంతో వారిని చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వీఆర్వోను మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.

● **ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి**

సోమలరేగడ గ్రామ సమీపంలో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా అధికారులు నివారణ చర్యలు చేపట్టడం లేదు. అక్కడ జరిగిన ప్రమాదాల్లో ఇప్పటికే పలువురు మృత్యువాతపడగా, మరికొందరు క్షతగాత్రులై మంచానికే పరిమితమయ్యారు. జాతీయ రహదారి నిర్మాణం జరిగిన తరువాత రేయింబవళ్లు గేదెలు రోడ్డుపైనే సంచరిస్తున్నాయి. దీంతో వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా హైవే, పోలీసు అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

రౌడీషీటర్‌పై పీడీ యాక్ట్ : కడప జైలుకు తరలింపు

నెల్లూరు(క్రైం), జూలై 18(ఆంధ్రజ్యోతి) : వరుస నేరాలకు పాల్పడుతున్న రౌడీషీటర్ షేక్ యాసీర్‌పై కలెక్టర్ ఓ ఆనంద్ ఆదేశాలతో వేదాయపాలెం పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేశారు. పోలీసుల సమా చారం మేరకు... నగరంలోని వెంగళరావు నగర్‌కు చెందిన షేక్ యాసీర్‌పై వేదాయపాలెం పోలీసు స్టేషన్‌లో రౌడీ షీట్ ఉంది. కొట్లాట, బెదిరించి నగదు దోచుకోవడం, మారణాయుధాలతో దౌర్జన్యం చేయడం, హత్యాయ త్నం వంటి కేసులున్నాయి. ప్రస్తుతం అతను హత్యాయత్నం కేసులో జిల్లా కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్నాడు. పలుమార్లు పోలీసులు కౌన్సెలిం గ్ నిర్వహించినా అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో కలెక్టర్ ఆదేశా లతో పీడీ యాక్ట్ నమోదు చేశారు. శుక్రవారం యాసీర్‌ను కడప కేంద్ర కారాగారానికి తరలించారు.

కృష్ణపట్నం పోర్టులో కార్మికుడి మృతి

ముత్తుకూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : అదానీ కృష్ణపట్నం పోర్టులో ప్రమాదవశాత్తు శుక్రవారం ఓ కార్మికుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. కృష్ణపట్నం పోర్టులో ఐదో బెర్త్ సమీపంలో ఎస్ఎస్ స్టేషన్ వద్ద కాకినాడకు చెందిన కృష్ణయ్య (55) నీటి సంపులో పడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ జేపీ శ్రీనివాసులురెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. కృష్ణయ్య మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మద్యం మత్తులో ప్రమాదవశాత్తు జారిపడి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కృష్ణపట్నం పోర్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని
వృద్ధురాలి దుర్మరణం

● **వాహనాలు తొక్కడంతో నుజ్జునుజ్జైన మృతదేహం**



శేషమ్మ (ఫైల్)

కావలిరూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని కందిపాటి శేషమ్మ(84) మృతి చెందిన ఘటన శుక్రవారం తెల్లవారుజామున మండలంలోని గౌరవరం సమీపంలో జాతీయ రహదారిపై జరిగింది. రూరల్ పోలీసుల కథనం మేరకు.. గౌరవరం ఎస్సీ కాలనీకి చెందిన శేషమ్మ ఒంగోలులోని బంధువుల ఇంట జరిగే ఓ కార్యక్రమానికి వెళ్లేందుకు తెల్లవారుజామున ఆటోలో బయలుదేరింది. మార్గమధ్యంలోని బోగోలు మండలం సాంబశివపురం సమీపంలో మరికొందరి బంధువుల కోసం ఆటో దిగింది. ఆ రోడ్డులో బంధువులు లేకపోవడంతో అక్కడ నుంచి కావలి వెళ్లేందుకు ఆటో కోసం జాతీయ రహదారి దాటుతుండగా ఒంగోలు వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. రాత్రి సమయం కావడం, అదే సమయంలో వర్షం పడుతుండడంతో ఆ మృతదేహంపై వాహనాలు వెళ్లడంతో నుజ్జునుజ్జై గుర్తు పట్టలేని విధంగా మారింది. హైవే మొబైల్ సిబ్బంది గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతురాలి పళ్లు, మెడలో దారం ఆధారంగా మహిళగా గుర్తించి చుట్టుపక్క గ్రామాలకు సమాచారం ఇచ్చారు. గౌరవరానికి చెందిన శేషమ్మ గ్రామంలో లేకపోవడం, రైలు వద్దకు వెళ్లకపోవడంతో మృతి చెందినది శేషమ్మగా గుర్తించామని సీఐ రాజేశ్వరరావు తెలిపారు. మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించి ఎస్‌ఐ తిరుమలరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	120
స్కిన్ చికెన్	216
స్కిన్‌లెస్	240

కోడిగుడ్ల ధర (100) : 520

రేపు 'గౌతమ బుద్ధునితో నా ప్రయాణం' నాటక ప్రదర్శన

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో ఆదివారం గౌతమ బుద్ధునితో నా ప్రయాణం నాటకాన్ని ప్రదర్శించనున్నారు. సాయంత్రం 6 గంటలకు ఈ ప్రదర్శన జరుగు తుందని ది బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు కుడాలి ఉపాసక మస్తాన్, అంబేడ్కర్ మిషన్ చైర్మన్ కావలి ఇరువళ్లూరు, వర్కింగ్ చైర్మన్ వైకుంఠం రామయ్య తెలిపారు. వారు శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. నాటకం బ్రోచర్లను ఆవిష్కరించారు. భారతదేశంలో జన్మించి విశ్వవ్యాప్తి చెందిన బుద్ధుడి గుణగణాలను, ధర్మాలను ఈ నాటకం ద్వారా వివరిస్తామని తెలిపారు. ప్రదర్శనకు రూ.200 ప్రవేశ రుసుముగా నిర్ణయించామని చెప్పారు. ఈ నాటకాన్ని ప్రతి ఒక్కరు వీక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంబేటి శ్రీనివాసులు, పంగులూరు ప్రసాద్, డక్కా రమణయ్య, మేరిగ పెంచలయ్య, దారా వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి

● ఎమ్మెల్యే కోటంరెడ్డి కార్యాలయం వరకు కార్మికుల ప్రదర్శన

నెల్లూరు (వైద్యం), జూలై 18 (ఆంధ్రజ్యోతి) : నగర పాలక సంస్థలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలతోపాటు పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ ఆ కార్మికులు శుక్రవారం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధరరెడ్డి కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. నగరంలోని సర్వోదయ కళాశాల నుంచి కేవీఆర్ పెట్రోల్ బంక్ మీదుగా ఎమ్మెల్యే కార్యాలయం వరకు ఈ ప్రదర్శన కొనసాగింది. అనంతరం ఎమ్మెల్యేలు సమస్యలు ఏకరువుపెట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలను పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ దృష్టికి తీసుకెళుతానని, ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెంచల నర్సయ్య, నగర అధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ కార్మికులు ఆరు రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. 9వ డివిజన్‌లో పారిశుధ్య పనులను ప్రైవేటు కాంట్రాక్టర్‌కు అప్పగించారని, వెంటనే ఈ టెండర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నెల్లూరు రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, సీఐటీయూ నాయకులు సూర్యనారాయణ, సుధాకర్, శివాజీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాసులు, రాంబాబు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

యూరియా కొరతకు పరిష్కారం వెతికేనా?

నేడు రూరల్ మండల సర్వసభ్య సమావేశం ● గ్రామాల్లో తీవ్రమవుతున్న యూరియా సమస్య
ప్రతిసారి రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్ అధికారుల గైర్హాజరు ● ఈ సారైనా అందరూ వచ్చేనా?

నెల్లూరు రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత ఎడగారు వ్యవసాయ సీజన్‌లో నెల్లూరు రూరల్ మండల రైతులను యూరియా కొరత తీవ్రంగా వేధిస్తోంది. బయట వ్యాపారుల వద్దేకాదు ప్రభుత్వ నిర్వహణలోని రైతు కేంద్రాల్లోనూ యూరియా బస్తా కనిపించడం లేదు. వచ్చిన యూరియా వచ్చినట్టు మాయమైపోతోంది. దీనివల్ల చిన్న, సన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం జరిగే మండల పరిషత్ సర్వసభ్య సమావేశంపై అన్నదాతలు ఆశలు పెట్టుకున్నారు. పాలకులు, అధికారులు యూరియా కొరత పరిష్కారం చూపుతారని ఎదురుచూస్తున్నారు. మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై ఇటీవల నిర్వహించిన సామాజిక తనిఖీల్లో రూ.4.13 లక్షల నిధులు పక్కదారి పట్టినట్లు తనిఖీ బృందాలు తేల్చాయి. వీటి రికవరీపై ప్రజాప్రతినిధులు మండల సమావేశంలో చర్చించే అవకాశాలున్నాయి. నెల్లూరుకు పడమర నున్న గ్రామాల్లో చెరువుల ద్వారా పంచాయతీలకు ఆదాయ వనరులున్నాయి. చేపలు పట్టుకునే హక్కు బహిరంగ వేలం ద్వారా ఈ ఆదాయం సమకూరుతుంది. ఈ ఫసలీలో జరిగిన వేలంపాటల్లో కొన్ని పంచాయతీలు తప్ప మిగిలిన వాటిలో చేపల వేలం నగదు సంబంధిత ఖాతాల్లో జమకాలేదు. ఆ సొమ్ముపై అధికారులు మండల సభలో ఏం బదులిస్తారోనన్నది చర్చనీయాంశంగా మారింది. వీటికితోడు పంచాయతీల్లో పారిశుధ్య సమస్య, గృహ నిర్మాణాల బిల్లుల పెండింగ్ తదితర అంశాలపై సర్పంచులు, ఎంపీటీసీలు ఏమాత్రం ప్రశ్నిస్తారు, వాటికి అధికారులు ఏం సమాధానం చెబుతారో? అన్నది ఆసక్తికరంగా మారింది.

అందరూ హాజరయ్యేనా?

ఎంపీపీ బూడిద విజయ కుమార్ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని అధికారులు అన్నీ శాఖలతో కలిపి నిర్వహించనున్నారు. అయితే మండల సమావేశాలకు కీలక శాఖలైన రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్ శాఖల అధికారులు తరచూ డుమ్మాకొడుతూనే ఉన్నారు. ఈ శాఖలపై చర్యలకు కలెక్టర్‌కు సిఫార్సు చేస్తామంటూ ప్రతీ సమావేశంలో ప్రకటిస్తున్న అధికారులు అంతటితో ఆగిపోతున్నారేగానీ ఇప్పటి వరకు ఏ ఒక్క అధికారిపైనా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో తాజా సమావేశానికైనా అధికారులందరూ హాజరవుతారో.. లేదో చూడాలి.


మండల పరిషత్ కార్యాలయం


వెల్లంటిలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

బాబానగర్ వద్ద డివైడర్‌ను ఢీకొన్న లారీ

● రెండు నెలల్లో 25 ప్రమాదాలు

నెల్లూరు రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు - ముత్తుకూరు రహదారిపై బాబానగర్ వద్ద శుక్రవారం లారీ డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఎవరికీ ఏలాంటి ప్రమాదం జరగకపోయినప్పటికీ స్థానికులు ఆందోళన చెందారు. ముత్తుకూరు మండలంలోని థర్మల్ స్టేషన్ నుంచి యాష్ పౌడర్ లోడుతో నెల్లూరు వైపు వస్తున్న టర్బో లారీ డివైడర్ పైకెక్కింది. ఇక్కడ రోడ్లు, భవనాల శాఖ అధికారులు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, వేగ నియంత్రకాలు ఏర్పాటు చేయకపోవడం, కనీసం హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెండు, మూడు రోజులకు ఒక ప్రమాదం జరగడం పరిపాటిగా మారిందని, గడిచిన రెండు మాసాల్లో సుమారుగా 25 ప్రమాదాలు జరిగాయని చెబుతున్నారు. దీనిపై ఆర్ అండ్‌బీ అధికారులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా స్పందన కరువైందని వాపోతున్నారు.



ప్రమాదానికి గురైన లారీ

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లూరు (జడ్పీ), జూలై 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ ఈఈ ఎం శ్రీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సరస్వతి నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని రామ్‌నగర్ ఫీడర్లో మరమ్మతుల కారణంగా రామ్‌నగర్, పాత మిలిటరీ కాలనీ, కొండాయపాళెం గేట్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. రేబాలవారి వీధి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కోసం స్టోన్‌హౌస్‌పేట, నవాబుపేట, ఎఫ్‌సీఐ కాలనీ, ఏసీ నగర్, సరస్వతీ నగర్, రాయపుపాళెం, నజీర్‌తోట, సౌత్‌రాజుపాళెం ఇండస్ట్రియల్ ఏరియా పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.

రేపు 'విశాలాక్షి' వార్షికోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 18 (ఆంధ్రజ్యోతి) : విశాలాక్షి సాహిత్య మాసపత్రిక 16వ వార్షికోత్సవం ఆదివారం ఉదయం టౌనుహాలులో జరుగుతుందని ఆ పత్రిక వ్యవస్థాపకుడు కోసూరు రత్నం, 25 కళా సంఘాల గౌరవాధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం నగరంలో విలేకరుల సమావేశం నిర్వహించి వార్షికోత్సవ గోడపత్రికలు ఆవిష్కరించారు. ఈతకోట సుబ్బారావు, దోర్నాల హరిబాబు, అమీర్‌జాన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు యాదేరఫీ మ్యూజికల్ నైట్

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ గాయకుడు పద్మశ్రీ మహమ్మద్ రఫీ వర్థంతి సందర్భంగా ఆదివారం సాయంత్రం టౌనుహాలులో యాదే రఫీ మ్యూజికల్ నైట్ నిర్వహిస్తున్నామని మహమ్మద్ రఫీ కల్చరల్ అకాడమీ అధ్యక్షుడు జమీర్ అహమ్మద్, గాయకులు మహబూబ్‌బాషా, షఫీ, అమానుల్లాఖాన్ తెలిపారు. శుక్రవారం పురమందిరంలో ఈ కార్యక్రమ బ్రోచర్‌ను ఆవిష్కరించి విలేకరులతో మాట్లాడారు. రఫీ అభిమానుల సహకారంతో 32 ఏళ్లుగా 'యాదేరఫీ' నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమానికి వేమిరెడ్డి దంపతులు హాజరవుతారని తెలిపారు. సంగీతాభిమానులు తరలిరావాలని కోరారు.


యాదేరఫీ కార్యక్రమ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ముగిసిన గురుపౌర్ణమి ఉత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ సమీపంలో ఉన్న షిరిడీ సాయిబాబా మందిరంలో జరుగుతున్న గురు పౌర్ణమి ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా అన్నప్రసాద వితరణ జరిగింది. బాబాకు విశేష అలంకరణ, పూజలు జరిగాయి. మందిరం చైర్మన్ అమర్‌నాథ్ రెడ్డి, కమిటీ సభ్యులు దువ్వూరు జయమ్మ, కొల్లి శ్యామసుందర్‌రెడ్డి, పైడిపాటి సుధాకర్‌రావు తదితరులు పర్యవేక్షించారు.

వచ్చే విద్యా సంవత్సరానికి ల్యాంకో భవనాల్లో ఐటీఐ

● దేవదాయ మంత్రి రామనారాయణరెడ్డి


అధికారులతో చర్చిస్తున్న మంత్రి ఆనం

సంగం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధితోపాటు సాంకేతిక విద్య, స్కిల్ డెవలప్‌మెంట్‌కు పెద్దపీట వేస్తోందని దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన సంగం మండలంలోని తరుణవాయి పంచాయతీ పరిధి అమరపునాయుడు కండ్రికలో ల్యాంకో ఫౌండేషన్ నిర్వాహకులు సంగం ప్రభుత్వ ఐటీఐకి దానం చేసిన భవనాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2013లో సంగం మండలానికి మంజూరు చేసిన ప్రభుత్వ ఐటీఐని గత ప్రభుత్వ పాలకులు పట్టించుకోకపోవడంతో వసతి లేక ఐటీఐని ఆత్మకూరు పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరంలోపు ల్యాంకో ఫౌండేషన్ ఇచ్చిన భవనాల్లోకి కళాశాలను మార్చేందుకు చేపట్టాల్సిన పనులు, కావలసిన సీఎస్ఆర్ నిధులపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో ఆర్డీవో పావని, ఇంజనీరింగ్, ఐటీఐ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

డెంగ్యూ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలి

● వైద్యాధికారులు నాగార్జునరావు, జయరామ్

నెల్లూరు (వైద్యం), జూలై 18 (ఆంధ్రజ్యోతి) : డెంగ్యూ వ్యాధిపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ మలేరియా విభాగం అధికారులు నాగార్జునరావు, జయరామ్ సూచించారు. నగరంలోని వెంకటేశ్వరపురంలో ఉన్న మండల ప్రజాపరిషత్ పాఠశాలలో శుక్రవారం డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత తప్పక పాటించాలని సూచించారు. నీటి నిల్వల కారణంగా దోమలు పెరిగే అవకాశం ఉందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని ఇంట్లోనూ, పరిసరాల్లో నీటినిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. నిల్వ ఉన్న నీటిలో దోమల లార్వా ఎలా పెరుగుతుందో ప్రత్యక్షంగా చూపించారు. అనంతరం ఫ్రైడే డ్రైడేలో భాగంగా పరిసరాలను పరిశీలించి దోమల వల్ల కలిగే వ్యాధుల గురించి స్థానికులకు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మలేరియా నివారణ విభాగం నెల్లూరు అర్బన్ సబ్‌యూనిట్ అధికారులు శ్యాంస్‌బాబు, రామారావు, హెల్త్ అసిస్టెంట్ దొరబాబు, తదితరులు పాల్గొన్నారు.


నిల్వ ఉన్న నీటిలో దోమల లార్వా పెరుగుదలను చూపిస్తున్న అధికారి జయరామ్

బాలబాలికల భద్రతకు పటిష్ట చర్యలు

● డీఎస్పీ రామారావు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ రామారావు

నెల్లూరు(క్రైం), జూలై 18(ఆంధ్రజ్యోతి) : సమాజంలో బాలబాలికల భద్రత, రక్షణే ధ్యేయంగా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ కేసీహెచ్ రామారావు తెలిపారు. నగరంలో ని ఫత్తేఖాన్‌పేట రవీంద్రభారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మహిళా పోలీసు స్టేషన్ పోలీసులు శుక్రవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈవ్ టీజింగ్, శక్తియాప్, స్వీయ రక్షణ, పోక్సో చట్టం, బాల బాలికలపై జరుగుతున్న నేరాలు.. వంటి వాటిపై విద్యార్థులకు డీఎస్పీ అవగాహన కల్పించారు. ఇదే విధంగా నవాబుపేటలోని రవీంద్రభారతి పాఠశాలలో కూడా అవగాహన కార్యక్రమం జరిగింది. సబ్ ఇన్‌స్పెక్టర్ రెహమాన్ హాజరయ్యారు. మొబైల్స్, సోషల్ మీడియా కారణంగా ఇటీవల కాలంలో నేరాలు అధికమవుతున్నాయని, వీటిపై విద్యార్థులు అవగాహన పెంచుకుని వాటికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి శ్రీహరి, ప్రిన్సిపాల్ నిరుపమ, డీన్ శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాషువా గ్రంథాలయానికి నగర కమిషనర్ రూ.25 వేల విరాళం

నెల్లూరు(హరనాథపురం), జూలై 18(ఆంధ్రజ్యోతి) : నగరం లోని గుర్రం జాషువా ప్రజా గ్రంథాలయానికి నగర పాలక సంస్థ కమిషనర్ ఓబులేసు నందన్ రూ. 25వేల విరాళాన్ని అందచేశారు. ఆ గ్రంథాలయం కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు షేక్ ఖాసీంకు ఈ విరాళాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రంథాలయ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొమ్మల కృష్ణయ్య, ఈసీ మెంబర్ గంధం అంకయ్య, జనార్దన్, ఏవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. వారు కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

స్థానిక సంస్థలకు ప్రాధాన్యత

(5వ పేజీ తరువాయి)

మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలుపుతూ సభలో తీర్మానం చేయాలని కావలి ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి కోరారు. ఈ తీర్మానాన్ని ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, నెలవల విజయశ్రీలు బలపరచగా, ఆమోదిస్తున్నట్లు చైర్‌పర్సన్ అరుణమ్మ ప్రకటించారు.

● తల్లికి వందనంపై స్పెషల్ డ్రైవ్ : కలెక్టర్

'పాఠశాల స్థాయిలోనే విద్యార్థి వివరాలను యూడీస్ వెబ్‌సైట్‌లో నమోదు చేస్తే ఆటోమేటిక్‌గా తల్లికి వందనం పథకానికి అర్హత గుర్తిస్తున్నారు. అయితే కొన్ని ప్రైవేటు పాఠశాలలు విద్యార్థుల వివరాలను ఎంట్రీ చేయడంలో ఆలస్యం చేస్తున్నట్లు గుర్తించాం. అటువంటి పాఠశాలలపై స్పెషల్ డ్రైవ్ పెడతాం. తల్లికి వందనం పథకానికి సంబంధించి జిల్లాలో 1500 వరకూ గ్రీవెన్స్ వచ్చాయి. వాటిని పరిశీలిస్తున్నాం.' అని కలెక్టర్ ఆనంద్ అన్నారు.

● పలు అంశాలపై ఎమ్మెల్యేల నిలదీత

ఇళ్లకు కొత్తగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ మీటర్లతో ఎక్కువ బిల్లులు వస్తున్నాయని మునుపటితో పోలిస్తే 20 శాతం వరకూ ఎక్కువ యూనిట్లు వాడినట్లు వస్తోందని కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి అన్నారు. కొత్త మీటర్లు ఏర్పాటు సమయంలోనే కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు ఎందుకు తెలియజేయడం లేదని ఆయన ప్రశ్నించారు. దశాబ్దాల క్రితం వేసిన విద్యుత్ స్తంభాలే నేటికీ ఉన్నాయని వీటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాని కోరారు. గత ప్రభుత్వంలో ఏఎంసీ నిధులతో చేపట్టిన రోడ్డు పనులు ఎంతవరకు వచ్చాయని ఉదయగిరి ఎమ్మెల్యే కాకార్ల సురేష్ ప్రశ్నించారు. తల్లికి వందనం పథకం వివరాలను కూడా సభ ముందు ఉంచితే బాగుండేదని సూచించారు. చిల్లకూరు మండలం పొన్నపువారిపాలెం రోడ్డుకు అటవీ అనుమతులు వచ్చాయని, త్వరగా ఎస్టిమేషన్లు వేసి పంపాలని పీఆర్ అధికారులను ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి కోరారు. పాఠశాలల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని సూచించారు. డీపీఆర్‌సీ భవనాల నిర్మాణానికి నాలుగు నెలల క్రితం అనుమతులిస్తే ఇంతవరకూ ఎందుకు టెండర్లు పిలవలేదని చైర్‌పర్సన్ పంచాయతీరాజ్ అధికారులను ప్రశ్నించారు. సౌత్‌మోపూరు హైస్కూల్ ప్రహరీ శంకుస్థాపన సమయంలో ప్రొటోకాల్ ఉల్లంఘన జరిగిందని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా వెంగమాంబ ఉత్సవాలలో అధికారులు తమను గౌరవించకుండా ప్రొటోకాల్ ఉల్లంఘించారని దుత్తలూరు జడ్పీటీసీ మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆనం.. వెంటనే ఈ ఫిర్యాదుపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని దేవదాయ శాఖ అధికారులను ఆదేశించారు.

వచన కవిత్వంలో అపూర్వ ప్రయోగాలు

● అరసం ఉపాధ్యక్షుడు రామకృష్ణ ● పాతికేళ్ల తెలుగు సాహిత్యంపై సమాలోచన

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 18 (ఆంధ్రజ్యోతి) : గడిచిన పాతికేళ్లలో వచన కవిత్వ చందస్సులో ఎన్నో అపూర్వ ప్రయోగాలు జరిగాయని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా ఉపాధ్యక్షుడు పెరుగు రామకృష్ణ అన్నారు. నగరంలోని డీకే మహిళా కళాశాలలో కేంద్ర సాహిత్య అకాడమీ, అరసం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం 25 సంవత్సరాల తెలుగు సాహిత్యం - ఒక పరిశీలన అనే అంశంపై సమాలోచన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఆ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఏవీ రమణారావు పాల్గొన్నారు. ఇలాంటి సదస్సులు కళాశాలలో నిర్వహించడం వల్ల విద్యార్థులకు సాహిత్య విషయాలపై అవగాహన కలుగుతుందంటూ నిర్వాహకులను అభినందించారు. తెలుగు సాహిత్యంలో 25 సంవత్సరాలలో వచన కవిత్వంపై రామకృష్ణ ప్రసంగించి పత్రం సమర్పించారు. మరో రచయిత గంగిశెట్టి శివకుమార్ బాలసాహిత్యం వికాసంపై ఉపన్యసించారు. బాలసాహిత్య పఠనంతో విద్యార్థులు కుళ్లు, కుతంత్రాలు లేకుండా వికసిత జీవనానికి మార్గాలు వేసుకుంటారని తెలిపారు. అరసం జిల్లా కార్యదర్శి కరుణశ్రీ కథా సాహిత్యం 2001 నుంచి 2025 వరకు ఎలా వికాసం చెందిందో వివరించారు. ఈ సదస్సులో సమన్వయకర్త టేకుమళ్ల వెంకటప్పయ్య, టీవీ రామకృష్ణ ఆచార్యులు, కేవీ సత్యనారాయణ, డాక్టర్ ఎస్ సురేంద్ర, సాయసం సుబ్రహ్మణ్యం, రాజేంద్ర సింగ్, పోలవరపు నరసింహారావు పాల్గొన్నారు.


తెలుగు సాహిత్యంపై సమాలోచన సదస్సులో కవులు, రచయితలు

భక్తిశ్రద్ధలతో రాహుకాల ఉద్వాపన పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో శుక్రవారం రాహుకాల ఉద్వాపన పూజలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చండీ హోమం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, నవావరణ పూజలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం అమ్మవారికి కుంభహారతులు, పల్లకీ సేవ జరిగాయి. ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్ రెడ్డి పర్యవేక్షించారు.



ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

● రూ.8.32 కోట్ల ఎరువులు, పురుగు మందుల సీజ్

నెల్లూరు(వ్యవసాయం), జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. దాదాపుగా రూ.8.32 కోట్ల విలువైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను సీజ్ చేశారు. రాష్ట్ర విజిలెన్స్ బృందం జిల్లా వ్యాప్తంగా ఐదు రోజులుగా పలు దుకాణాలను తనిఖీ చేసింది. నెల్లూరు, పొదలకూరు, ఉదయగిరి, వింజమూరు, కలిగిరి, కందుకూరు గుడ్లూరు, కావలి ప్రాంతాల్లో రెండు విత్తనాల దుకాణాలు, 12 ఎరువుల దుకాణాలు, 14 పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేసింది. రికార్డులు నిర్వహణ సక్రమంగా లేకపోవడం, పురుగు మందుల కంపెనీలకు సంబంధించిన పత్రాలను రెన్యువల్ చేయకుండా అమ్మకాలు సాగించడం తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని



పురుగు మందుల దుకాణాల్లో రికార్డులు తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

రూ.8.32కోట్ల విలువ చేసే ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను సీజ్ చేసింది. ఈ తనిఖీల్లో వినుకొండ ఏడీఏ సీహెచ్ రవికుమార్, ఒంగోలు విజిలెన్స్ సీఐ ఎన్ రాఘవరావు, నెల్లూరు ఏడీఏ నర్సోజీరావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఆరోగ్య అధికారిగా కనకాద్రి

నెల్లూరు(సిటీ), జూలై 18 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర పాలక సంస్థ ఆరోగ్య అధికారి (ఎంహెచ్‌వో)గా డాక్టర్ కనకాద్రిని నియమిస్తూ పురపాలక శాఖ శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. ఆయన ప్రస్తుతం కేంద్ర కారాగారంలో వైద్యుడిగా పని చేస్తున్నారు. ప్రస్తుత ఎంహెచ్‌వో చైతన్యకు ఏడాది డిప్యుటేషన్ గడువు ముగియడంతో ఆయన తిరిగి వైద్య, ఆరోగ్య శాఖలో రిపోర్టు చేయనున్నారు. డాక్టర్ కనకాద్రి ఎంహెచ్‌వోగా ఎప్పుడు బాధ్యతలు స్వీకరిస్తారో తెలియాల్సి ఉంది.

కడుపు నింపిన నేస్తమా...

నీకిదే.. కన్నీటి వీడ్కోలు!

● యజమాని అంతిమయాత్రలో పాల్గొన్న శునకం

పొదలకూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మనిషి చనిపోయిన తరువాత తలకొరివి పెట్టేవాడు కొడుకు.. పాడి మోసేవాళ్లు ఆప్తులు.. కాటిదాకా వచ్చే వాళ్లే బంధుమిత్రులు. అయితే కొన్ని సందర్భాల్లో మూగ నేస్తాలు కూడా కాటిదాకా వస్తుంటాయి. కానరాని లోకాలకు చేరుకున్న తన యజమాని కోసం దీనంగా కన్నీరు పెడతాయి. వాటినెవరూ ఓదార్చలేరు. విశ్వాసానికి మారుపేరైన ఓ శునకం కూడా తన యజమాని అంత్యక్రియల్లో పాల్గొని 'స్వామి' భక్తిని చాటుకుంది. పొదలకూరు పట్టణంలోని మెయిన్ రోడ్డులో నివసిస్తున్న కాసా చలపతి అనే వ్యక్తి శుక్రవారం గుండెపోటుతో మరణించాడు. ఆ విషయం ఆ శునకానికి తెలిసిందో.. ఏమో రోజూ తనకు ఆహారం పెట్టి, బాగోగులు చూసే యజమాని మరణించడంతో దిగులు పడిపోయింది. బాధతో శ్మశానం వరకు వచ్చింది. ఆ శునకం మూగ వేదన తెలియని వారు.. దారిలో అడ్డం వస్తోందని తరిమేస్తున్నా.. కాటివరకు అందరితోపాటు అంతిమయాత్రలో పాల్గొన్నది. గోతి తవ్వి చలపతి మృతదేహాన్ని పూడ్చి పెట్టే వరకూ చూస్తూ ఉండిపోయింది. అంత్యక్రియలు పూర్తయ్యాక.. అందరితో పాటే అక్కడి నుంచి వెనుదిరిగింది. ఈ దృశ్యం చూసి స్థానికుల గుండెలు బాధతో బరువెక్కిపోయాయి.



యజమాని అంత్యక్రియల వద్ద నిరీక్షిస్తున్న శునకం

వ్యాధుల వర్రీ!

- ఎడగారు వరిలో ఆకుముడత..
- రసం పీల్చే ఆకునల్లితో పంట నష్టం
- కంకినల్లితో తాలు గింజలు
- జాగ్రత్తలు అవసరం
- కేవీకే శాస్త్రవేత్త లోకేష్‌బాబు



నెల్లూరు రూరల్ మండలంలో సాగవుతున్న వరి పైరు



ఆకుముడత కలుగజేసే గొంగళిపురుగు

నెల్లూరు(వ్యవసాయం), జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎడగారు (ముందస్తు ఖరీఫ్) సీజన్‌లో సాగవుతున్న వరి పంటకు వ్యాధుల బెడద ఎక్కువగా ఉంది. ఆకుముడత ఆకుముడత కలుగజేసే గొంగళి పురుగుతో, పెద్దనల్లి పురుగులు ఆకు అడుగుభాగాన చేరి రసాన్ని పీల్చి పంటను దెబ్బతీసే ప్రమాదం ఉంది. దీంతో రైతులకు ఆర్థిక నష్టం వాటిల్లే అవకాశం ఉంది. దీనిపై కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ లోకేష్‌బాబు రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

● ఆకుముడతతో తెల్లగా....

గొంగళి పురుగు ఆకుముడతలో ఉండి పత్ర హరితాన్ని గోకి తినడం వల్ల ఆకులు తెల్లబడిపోతాయి. దీంతో పోటాకు దశలో పంటకు నష్టం ఎక్కువగా ఉంటుంది. దుబ్బకి లార్వా లేకపోతే పురుగులు సోకిన ఆకులు ఉండడం వల్ల పంట దెబ్బ తింటుంది. వీటిని గుర్తిస్తే పిలకదశలో క్లోరిపైరిఫాస్ 20 ఈసీ 2.5మిల్లీ లీటర్లు, లేదంటే క్లోరాంట్రనిలిప్రోల్ 20 ఎస్‌సీ 0.3 మిల్లీ లీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. అదేవిధంగా చిరుపొట్ట దశలో కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్.పి 2గ్రాములు లేదంటే ఎసిఫేట్ 75 యస్.సి 1.5 గ్రాములు లేదంటే క్లోరాంట్రనిలిప్రోల్ 18.5 యస్.సి 0.3 మిల్లీ లీటర్లుల లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

● రసాన్ని పీల్చే ఆకునల్లి..

ఆకునల్లి పురుగులు ఆకుల అడుగు భాగాన ఆశించి రసాన్ని పీల్చి వేయడం వల్ల ఆకులు ఎండిపోయినట్లుగా కనిపిస్తాయి. బెట్ట పరిస్థితుల్లో పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. నివారణకు నీటిలో కరిగే గంధకపు పొడి 50శాతం 3గ్రాములు లేదంటే ప్రొఫెనోఫాస్ 50ఇ.సి 2మిల్లీ లీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

● కంకినల్లితో తాలుగింజలు..

కంటికి కనిపించని సూక్ష్మ సాలీడు వర్గానికి చెందిన పురుగులను కంకి నల్లి(నల్లకంకి) అంటారు. ఇవి ఆశించినప్పుడు ఆకులపై పుసుపు రంగు చారలు ఏర్పడి క్రమేణా ఆకు తొడిమల లోపల, అదేవిధంగా ఆకు ఈనెలపై, ఆకు తొడిమలపై నల్లని మచ్చలు ఏర్పడతాయి. గింజలపై నల్లని మచ్చలు మచ్చలు ఏర్పడి పాలుపోసుకోక తాలు గింజలుగా అవుతాయి. కంకినల్లి పురుగు లక్షణాలు గుర్తించిన వెంటనే 15రోజుల వ్యవధిలో రెండుసార్లు ప్రొఫెనోఫాస్ 20ఇ.సి 2మిల్లీ లీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదంటే స్పైరోమెసిఫెన్ 240ఎస్.సి 1మిల్లీ లీటరు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

రూరల్లో వణికిస్తున్న 'మైట్'

అక్కడక్కడ మెంపిప్పితో గుబులు

నెల్లూరు రూరల్ (ఆంధ్రజ్యోతి) : ఈ ఎడగారు సీజన్‌లో నెల్లూరు రూరల్ మండలంలో సుమారు 15 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఉష్ణోగ్రతలు పెరగంతో మైట్ (నల్లిపురుగు) వ్యాధి పంటను ఆశించింది. నల్లిపురుగు అంతటా సోకడంతో దిగుబడిపై ప్రభావం ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ వ్యాధితో వరి ఆకులు పసుపుగా మారి పంట బలహీనమవుతుంది. మరోపక్క మెంపిప్పి (కాండం తొలుచు పురుగు) అక్కడక్కడ సోకుతుండటం రైతులను మరింత వేధిస్తోంది. ఈ రెండు వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించి వరికి ఆరోగ్య రక్షణ కల్పించేందుకు ఊరూరా పొలం పిలుస్తోంది పేరిట సదస్సులు నిర్వహిస్తున్నామని మండల వ్యవసాయా ధికారి ఎస్వీ నాగమోహన్ తెలిపారు.



రైతులకు సూచనలిస్తున్న కేవీకే విస్తరణ విభాగం శాస్త్రవేత్త లోకేష్‌బాబు

రేపు కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు (విద్య), జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ది కబడ్డీ అసోసియేషన్ ఆఫ్ నెల్లూరు డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో ఆదివారం యూత్ జిల్లా జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి జీ సతీష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మధ్యాహ్నం 3 గంటలకు ఎంపికలు జరుగుతాయని, ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డుతో హాజరు కావాల న్నారు. ఎంపికైన వారు కాకినాడ లో ఈనెల 25న జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతి నిధ్యం వహిస్తారని తెలిపారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల గడువు పునరుద్ధరణ

నెల్లూరు (విద్య), (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకు మరో ఏడాది గడువును పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు డీకేడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.గిరి ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరంలో 30-4-2025 వరకు పనిచేసిన కాంట్రాక్ట్ అధ్యాపకులు పూర్తి వివరాలతో అర్హత ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుకు జతపరిచి ఆయా కళాశా లల్లోని ప్రిన్సిపాళ్లకు ఈనెల 21వ తేదీలోపు అందజేయాలన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు, విద్యార్థులు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

● ఏఐఎస్ఎఫ్ ధర్నా

నెల్లూరు(విద్య), జూలై 18 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నెల్లూరులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ అధికారం చేపట్టిన రెండు నెలల్లోనే విద్యార్థుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పూర్తయినా సమస్యలు పరిష్కరించలేదని విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్‌లో ప్రకటించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ కేవలం కాగితాలకే పరిమితమవడంతో విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నాయని చెప్పారు. డిగ్రీ, ఇంజనీరింగ్ పూర్తిచేసుకున్న విద్యార్థులు పై చదువులకు, ఉద్యోగాలకు వెళ్లేందుకు సర్టిఫికెట్ల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పేద విద్యార్థులకు ఉన్నత చదువును దూరం చేసే జీవో నెం 77ను రద్దు చేసి, ఫీజు బకాయిలన్నీ వెంటనే విడుదల చేయాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రస్థాయిలో ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శివం వర్మ, అబ్దుల్, జీవన్‌సాయి, కోటి, జాహ్నవ్, ఆకాష్, ఇమ్రాన్, వైభవ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

దగదర్తి(బిట్రగుంట), జూలై 18 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం సున్నంబట్టి వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ పన్నీర్‌సెల్వం (56) మృతి చెందాడు. ఎస్ఐ జంపాని కుమార్ కథనం మేరకు.. చెన్నైకి చెందిన పన్నీర్ సెల్వం ఈనెల 16వ తేదీన హైదరాబాద్ నుంచి లారీలో ఆటో స్పేర్‌పార్ట్స్ లోడుతో బయలుదేరాడు. గురువారం రాత్రి దగదర్తి మండల పరిధిలోని సున్నంబట్టి గ్రామ సమీపంలో నిద్రమత్తులో ముందు వెళుతున్న వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో నెల్లూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

కాలువలో వృద్ధుడి మృతదేహం

దగదర్తి(బిట్రగుంట), జూలై 18(ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం మొబ్బుగుంటపాలెం వద్ద ఉన్న కాలువలో శుక్రవారం మధ్యాహ్నం ఓ వృద్ధుడి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. ఎస్ఐ జంపాని కుమార్ కథనం మేరకు.. సంగం మండలం తరుణవాయికి చెందిన తిరుపతయ్య (75) గురువారం మధ్యాహ్నం పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆయన కోసం గాలించిన కుటుంబ సభ్యులు ఫలితం లేకపోవడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం కావడంతో సంగం పోలీసులకు సమాచారం ఇవ్వగా ఆ మృతదేహం తిరుపతయ్యదిగా ఆయన కుమారుడు రత్తయ్య గుర్తించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రతి నెలా మూడో శుక్రవారం

ఉద్యోగుల గ్రీవెన్స్‌డే

● సద్వినియోగం చేసుకోవాలి : జేసీ కార్తీక్




ఉద్యోగుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), జూలై 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రతి నెలా 3వ శుక్రవారం ఉద్యోగుల కోసం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని, దీనిని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఉద్యోగుల కోసం మొట్టమొదటి గ్రీవెన్స్ డే కార్యక్రమం జరిగింది. ఉద్యోగుల నుంచి జేసీ అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ, వైద్య ఆరోగ్య, సచివాలయ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ తదితర శాఖల ఉద్యోగులు వినతిపత్రాలిచ్చారు. ప్రధానంగా బదిలీలకు సంబంధించి వినతులు ఎక్కువగా వచ్చాయి. జేసీ మాట్లాడుతూ 124 మంది ఉద్యోగులు అర్జీలిచ్చారని, కలెక్టర్ ఆదేశాల మేరకు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి హుస్సేన్ సాహెబ్, కలెక్టరేట్ ఏవో విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత గ్రేజింగ్ భూముల్లో దుక్కులు

- వర్షాలు పడుతుండటంతో పంటల సాగుకు సన్నాహాలు
- గతంలో ఆక్రమణలు తొలగించాలని హెచ్చరించిన అధికారులు
- పట్టించుకోని ఆక్రమణదారులు

లింగసముద్రం, జూలై 18(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రారెడ్డిపాలెం పంచాయతీ వెంగళాపురంలోని సర్వే నెంబర్లు 155/-1, 2లోని పంచాయతీ గ్రేజింగ్ (మేత పొరంబోకు) భూముల్లో కొందరు ఆక్రమణదారులు పంటల సాగుకు సన్నాహాలు ప్రారంభించారు. అడపాదడపా కురుస్తున్న వర్షాలతో భూములు పదునెక్కడంతో దుక్కులు దున్నడం ప్రారంభించారు. ఈ సర్వే నెంబర్లలో సుమారు 155 ఎకరాల భూములు ఉండగా కొన్ని భూములను వెంగళాపురం గ్రామానికి చెందిన కొందరు ఏళ్ల తరబడి ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారు. మరికొందరు ఆక్రమించిన భూములను తిమ్మారెడ్డిపాలెం, ఎర్రారెడ్డిపాలెం, వలేటివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులకు కౌలుకు ఇస్తూ అక్రమంగా ధనార్జనకు పాల్పడుతున్నారు. దీంతో సుమారు నాలుగైదు నెలల క్రితం రెవెన్యూ అధికారులు ఈ భూములను పరిశీలించి, సుమారు 80 ఎకరాలు ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నట్లు గుర్తించారు. అంతేగాక ఆక్రమించిన భూముల్లో బోర్లు వేసి, వాటికి విద్యుత్ కలెక్షన్లు కూడా తీసుకున్నట్లు గుర్తించారు. దీంతో రెవెన్యూ అధికారులు మరోసారి ఈ భూముల్లో పంటలు సాగు చేయవద్దని హెచ్చరించడంతోపాటు తక్షణం ఆక్రమణదారులు భూములను ఖాళీ చేయాలని ఆదేశించారు. ఇదేమీ పట్టించుకోని ఆక్రమణదారులు గత వారం రోజుల నుంచి అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో మళ్లీ పంటలు సాగు చేసేందుకు దుక్కులు దున్నుతున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



వెంగళాపురం పంచాయతీలోని ఆక్రమిత భూముల్లో పంటల సాగుకు దుక్కులు దున్నిన దృశ్యం

కీలక పోస్టులకు ఇన్‌చార్జులే దిక్కు!

- విద్యాశాఖలో ఖాళీగా ముఖ్య స్థానాలు
- అంతంత మాత్రంగా పర్యవేక్షణ
- విద్యారంగ ఉన్నతిపై తీవ్ర ప్రభావం

నెల్లూరు(విద్య), జూలై 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని విద్యాశాఖలో తాత్కాలిక బాధ్యతలతో నెట్టుకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న విద్య, మౌళిక సదుపాయాలు, ఇతరత్రా సమస్యలపై పర్యవేక్షణ చేయాల్సిన మండల విద్యాశాఖాధికారులు అత్యధిక ప్రాంతాల్లో ఇన్‌చార్జులే వ్యవహరిస్తున్నారు. శాఖాపరమైన కార్యక్రమాల పర్యవేక్షణ, జిల్లా కేంద్రంలో సమావేశాలు, సమాచార మార్పిడి పనులకు ఎక్కువ సమయం కేటాయించడానికే ఈ పోస్టుల సమయం సరిపోతుందన్న విమర్శలూ ఉన్నాయి. డీఈఓ స్థానం తర్వాత ఉప విద్యాధికారుల స్థానాలు మొత్తం నాలుగు ఉండగా వీటిలో నలుగురూ ఇన్‌చార్జులతో కాలం వెల్లదీస్తున్నారు. జిల్లాలో 38 మండలాల్లో ఎంఈఓ-1లు 18 మండలాల్లో రెగ్యులర్‌గా ఉండగా 20 మండలాల్లో మాత్రం ఇన్‌చార్జులు పనిచేస్తున్నారు. వీరిలో కూడా రెగ్యులర్ ఎంఈఓ-1లు ఇతర ప్రాంతాల్లో కూడా ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తుండటం విశేషం. నెల్లూరు అర్బన్ ఎంఈఓ-1 రెగ్యులర్‌గా విధులు నిర్వహిస్తూ నెల్లూరు రూరల్ ఎంఈఓ-1గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎంఈఓ-2కు సంబంధించి అన్ని మండలాల్లో రెగ్యులర్ ఎంఈఓలు ఉండగా ఒక్క సీతారామపురానికి మాత్రం ఎవరినీ నియమించలేదు.

● అన్ని వసతులున్న చోట మాత్రమే రెగ్యులర్

జిల్లాలో 18 మంది రెగ్యులర్ ఎంఈఓ-1లు అన్ని వసతులు కలిగి, నగరానికి సమీప మండలాలు, రోడ్డు సర్వీస్ ఉన్న మండలాల్లో మాత్రమే రెగ్యులర్‌గా పని చేస్తున్నారు. జిల్లాకు సుదూర ప్రాంతాలు, వసతులు లేని చోట మాత్రం ఎవరూ సుముఖత చూపకపోవడంతో 20 మండలాల్లో ఇన్‌చార్జులతోనే నెట్టుకు రావాల్సి వస్తోంది. విద్యారంగం ఉన్నతికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తున్నా శాఖాపరమైన ఇబ్బందులతో విద్యాశాఖ కునారిల్లుతోంది. సమగ్రశిక్ష, విద్యాశాఖ ఇచ్చే ఇతర కార్యక్రమాలను మండలాల్లో అమలు చేయాల్సిన బాధ్యత ఎంఈఓలదే. నిత్యం ఉన్నతాధికారులకు వారడిగిన సమాచారం నివేదికల రూపంలో పంపడంలో ఎంఈఓలు తలమునకలవుతున్నారు. ప్రతి సోమవారం స్పందన, వారంలో ఒకరోజు జిల్లాస్థాయి శాఖాపరమైన సమీక్ష, మరోరోజు ఉన్నతాధికారుల సమీక్ష, వీటికితోడు ప్రజాప్రతినిధుల కార్యక్రమాల్లో ప్రొటోకాల్ హాజరు, నాడు-నేడు, విద్యాకానుక, మౌళిక వసతులు, మధ్నాహ్నభోజనం, హాజరు యాప్ పర్యవేక్షణ, తల్లిదండ్రుల కమిటీల ఎన్నికల నివేదికలు, మరికొద్దిరోజుల్లో తల్లికివందనం జాబితాలు తదితర కార్యక్రమాలతోనే సమయం సరిపోతుందని ఎంఈఓ ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల సర్వీసు రిజిస్టర్ల నిర్వహణ, సెలవుల వివరాలు, వేతన బిల్లులపై సంతకాలు తదితర సాధారణ విధులకు సమయం ఉండడం లేదని మరో అధికారి పేర్కొన్నారు.



● విద్యార్థులపై తీవ్ర ప్రభావం

పాఠశాలల్లో నిర్వహించే అన్ని రకాల పరీక్షలపై పూర్తిస్థాయిలో పర్యవేక్షించడంతో పాటు ఫలితాల మెరుగుదలపై శ్రద్ధ తీసుకోవాల్సి ఉంది. అయితే వీటిపై దృష్టి సారించే ఉప విద్యాశాఖాధికారులు ఇన్‌చార్జులుగా ఉండడంతో దీని ప్రభావం ఫలితాలపై పడుతోందని విద్యాశాఖ వర్గాలు చెపుతున్నాయి. నెల్లూరు, కందుకూరు, కావ లి డిప్యూటీ ఈఓలుగా కూడా ఎంఈఓలకే అదనపు బాధ్యతలు అందించి నెట్టుకొస్తున్నారు. దీంతో ఓ వైపు తమ రెగ్యులర్ పోస్టుకు సంబంధించి బాధ్యతలు నిర్వర్తిస్తూనే అదనంగా ఈ బాధ్యతలు కూడా చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనికితోడు అన్ని పాఠశాలల్లోనూ సరిపడా ఉపాధ్యాయులూ లేకపోవడంతో సమస్య తీవ్రతను రెట్టింపు చేస్తోంది.

● పదోన్నతులు ఎప్పటికో!?

సర్వీస్‌రూల్స్ సమస్య ఒక కొలిక్కివస్తే ప్రధానోపాధ్యాయులు, జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్), బీఈడీ కళాశాలల్లో అధ్యాపకులుగా, ఎంఈఓలుగా, డిప్యూటీ ఈఓలుగా పదోన్నతులు దక్కనున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయమని కోరుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదంటున్నారు. అలాగే యాప్‌ల నమోదు పనిభారం తగ్గించి నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులకు, పర్యవేక్షణ అధికారులకు వెసులుబాటు కల్పించాలని కోరుతున్నారు.

డీసీ పల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు 900 బేళ్లను తీసుకొని రాగా 18 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 608 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 292 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 280కాగా, కనిష్ఠ ధర రూ. 159గా పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9423
వెండి కిలో ధర	రూ. 116200
వెండి ఒక గ్రాము	రూ. 119.20



అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు

● వి శశిధర్, ఎంఏవో, సంగం

సంగం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువులను ఎంఆర్పీ కంటే అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి వి శశిధర్ తెలిపారు.

? అన్నదాత సుఖీభవ పథకానికి ఎంతమంది రైతులు అర్హులు. ఈ కెవైసీ పూర్తయిందా.

! మండలంలో మొత్తం 3,816 మంది రైతులు ఉండగా అన్నదాత సుఖీభవ పథకానికి 3,787 మంది రైతులు అర్హులు. వీరిలో 3,743 మందికి ఈకేవైసీ పూర్తయింది. 44 మంది అందుబాటులో లేకపోవడంతో పెండింగ్‌లో ఉంది.

? సొసైటీలు, ఆర్ఎస్కేల్లో యూరియా అందుబాటులో ఉందా.

! ప్రస్తుతం దువ్వూరు సొసైటీకి 18 టన్నుల యూరియా వచ్చింది. రైతులకు పంపిణీ చేస్తున్నారు. అలాగే మండలంలోని ముగ్గురు ప్రైవేట్ డీలర్ల వద్ద యూరియా అందుబాటులో ఉంది.

? యూరియా కొరత తీర్చేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! యూరియా అవసరమైన రైతుల నుంచి నగదు వసూలు చేసి రైతు సేవా కేంద్రాల ఇండెంట్ పెట్టాము. త్వరలో వస్తుంది. అదేవిధంగా సంగం సొసైటీ ద్వారా యూరియా ఇచ్చేందుకు ఇండెంట్ పంపాము.

? అధిక ధరతో పాటు కాంప్లెక్స్ ఎరువులు కొంటేనే యూరియా ఇస్తామని ప్రైవేట్ డీలర్లు లింక్ పెడుతున్నారు. దానిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారు.

! మా దృష్టికి రాలేదు. డీలర్లు అధిక ధరకు విక్రయిస్తే రైతులు రశీదులు తీసుకుని మా దృష్టికి తెస్తే వారిపై చర్యలు తీసుకుంటాం.

? ఈక్రాప్ నమోదు ప్రక్రియను ఎప్పుడు ప్రారంభిస్తారు.

! ఈక్రాప్ ఇంకా ప్రారంభం కాలేదు. త్వరలో వీఏఏలకు ఈక్రాప్‌పై శిక్షణ ఇచ్చి ప్రభుత్వం ఆదేశించగానే ప్రారంభిస్తాం.

సమస్యల వలయంలో గ్రామాలు

ప్రజల అవస్థలు ● పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంకు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో ఏళ్ల తరబడి సమస్యలు తిష్టవేసినప్పటికీ పట్టించుకునే నాథులే కరువయ్యారని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. జిల్లా కేంద్రానికి శివారు మండలం కావడంతో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సమస్యలతో ప్రజలు సహజీవనం చేస్తున్నారు. ప్రధానంగా తాగునీటి పథకాలు మొరాయించడంతో ఫ్లోరిన్ నీరే దిక్కుగా మారింది. ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం కింద మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో నిర్మించిన మదర్‌ప్లాంటుతో సహా ట్యాంకులు సైతం నిరుపయోగంగా మారి తుప్పుపట్టి పోతున్నాయి. అలాగే సమీప గండిపాళెంలోని రక్షిత మంచినీటి పథకం సైతం అలాగే ఉండడంతో గ్రామాల్లోని ఓవర్‌హెడ్ ట్యాంకులు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. తూర్పుబోయమడగల, జీ.కొత్తపల్లి, కొండ్రాజుపల్లి తదితర గ్రామాల్లోని చేతిపంపులు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోక వెక్కిరిస్తున్నాయి. వీటితోపాటు చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలు వినియోగంలో లేకపోవడంతో గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారుతోంది. చెత్తను తరలించేందుకు వరికుంటపాడు, తిమ్మారెడ్డిపల్లి గ్రామాలకు సరఫరా చేసిన బ్యాటరీ వాహనాలు మరమ్మతులకు గురైనా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అలాగే ఇటీవల మంజూరైన ట్రాక్టర్లు, రిక్షాలు కూడా అలంకారంగానే మిగిలాయి. దీంతో రహదారుల వెంట పేడ దిబ్బలు, చెత్తా, చెదారం పేరుకుపోయాయి. పలు ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో మరుగుదొడ్లు లేకపోవడం, స్త్రీశక్తి భవనం, హౌసింగ్, రెవెన్యూ కార్యాలయాల ప్రాంగణాల్లో ఉన్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది. కాకొల్లువారిపల్లి నుంచి రామాపురం వరకు రింగురోడ్డు నిర్మాణం ఎన్నికల హామీగానే మిగిలిపోయింది. అంతేగాక జీ.కొత్తపల్లి, తూర్పుబోయమడగల సమీపంలోని ప్రధాన రహదారుల వంతెనలు ప్రమాదకరంగా మారడంతో ప్రయాణికులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొంది. వరికుంటపాటు, కాంచెరువు, ఇస్కపల్లి, యర్రంరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో విద్యుత్ సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. ఈ ఏడాది మండల కేంద్రంలోని బీసీ వసతిగృహాన్ని మూసి వేయడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.



తుప్పు పడుతున్న బ్యాటరీ వాహనం

నేటి సమావేశంలో సభ్యులు గళం విప్పేనా..

ఇలా గ్రామాల్లో సమస్యలతో ప్రజలు సతమతమవుతున్న నేపథ్యంలో శనివారం నిర్వహించే మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఎంతమేర గళం విప్పుతారో, సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపడతారో వేచి చూడాల్సిందే.

సాంకేతిక విద్యకు పెద్దపీట : మంత్రి ఆనం

సంగం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధితోపాటు సాంకేతిక విద్య, స్కిల్ డెవలప్‌మెంట్‌కు పెద్దపీట వేస్తోందని దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం సంగం మండలంలోని తరుణవాయి పంచాయతీలో అమరపునాయుడు కండ్రికలో ల్యాంకో ఫౌండేషన్ నిర్వాహకులు సంగం ప్రభుత్వ ఐటీఐకి దానం చేసిన భవనాలను అధికారులతో కలిసి ఆనం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగంలో 2013లో మంజూరు చేసిన ప్రభుత్వ ఐటీఐని గత ప్రభుత్వ పాలకులు పట్టించుకోకపోవడంతో వసతి లేక ఐటీఐని ఆత్మకూరు పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న విషయం విదితమే. సంగం ప్రభుత్వ ఐటీఐకి స్వంత భవనాలు లేకపోవడంతో ల్యాంకో ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమరపునాయుడు కండ్రికలో ఉన్న రూ. 6 కోట్ల విలువైన భవనాలను ఐటీఐకి దానం చేయడానికి రావడం, అందుకు ఫౌండేషన్ నిర్వాకుల కుటుంబ పెద్ద లగడపాటి వెంకట రామానాయుడు పేరును ఐటీఐకి పెట్టాలని కోరడం జరిగింది. ఆమేరకు ప్రతిపాదనలు పంపడంతో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అంగీకరించి ఇటీవల జీవో నెంబరు 239 విడుదల చేయడం జరిగింది. దీంతో సంగం ప్రభుత్వ ఐటీఐ లగడపాటి రామానాయుడు ప్రభుత్వ ఐటీఐ గా మార్చడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఆత్మకూరులో నిర్వహిస్తున్న ఐటీఐ తరగతులను వచ్చే విద్యా సంవత్సరం లోపు ల్యాంకో ఫౌండేషన్ ఇచ్చిన భవనాల్లో మార్చేందుకు చేపట్టాల్సిన పనులు, కావలసిన సీఎస్ఆర్ నిధులపై అధికారులతో చర్చించారు. త్వరలో పనులు ప్రారంభించి రెండు, మూడు నెలల్లో తరగతులు, ప్రాక్టికల్స్ గదులను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో పావని, ఇంజనీరింగ్, ఐటీఐ అధికారులతోపాటు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.



అధికారులతో చర్చిస్తున్న మంత్రి రామనారాయణరెడ్డి

పేదల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం

● **ఆత్మకూరు:** పేదల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం అని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం రాత్రి ఆత్మకూరు మండలంలోని బట్టేపాడు గ్రామంలో టీడీపీ శ్రేణులతో కలిసి పర్యటించి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజలకు పారదర్శకమైన పాలన అందించడమే లక్ష్యంగా ప్రతి ఇంటికి వెళ్లి, సమస్యలు తెలుసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు సుంకర పెంచలచౌదరి, మండల ప్రధాన కార్యదర్శి, బట్టేపాడు ఎంపీటీసీ సభ్యుడు డాక్టర్ తూమాటి శశిధర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు తూమాటి ధనుంజయరెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ కేతా విజయభాస్కర్‌రెడ్డి, పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

●**సీతారామపురం :** మండల పరిధిలోని బాలాయిపల్లిలో శుక్రవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం మండల తెలుగు యువత నాయకుడు పసుపులేటి వికాష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీచేస్తూ తెలుగుదేశం ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల యువత నాయకులు బండి రవి, ముత్తంశెట్టి కృష్ణ, అప్పని శ్రీను, ముత్తంశెట్టి రవి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు

ఆత్మకూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా సీఐటీయు ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం రెండవ రోజుకు చేరింది. మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు బైటాయించి సమ్మెను కొనసాగించారు. సమ్మెకు మద్దతుగా సీఐటీయు అనుబంధ సంఘాలు, ఆవాజ్ కమిటీ నేతలు సమ్మె శిబిరాన్ని సందర్శించి తమ సంఘీభావం ప్రకటించారు. ఈసందర్భంగా సీఐటీయు జిల్లా నాయకులు జి శివప్రసాద్, ఆవాజ్ కమిటీ మండల కార్యదర్శి పి యస్దానీ మాట్లాడుతూ మున్సిపాల్టీ ఇంజనీరింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెంబరు 36 ప్రకారం వెంటనే జీతాలు పెంచాలని కోరారు. ఈకార్యక్రమంలో సీఐటీయు నాయకులు కొండమూరి హజరత్తయ్య, కె డేవిడ్‌రాజు, ఆవాజ్ కమిటీ నాయకులు పి సల్మాన్‌ఖాన్, షేక్ ఆషికిన్, షేక్ ఖాజారహమతుల్లా, పి చాంద్‌బాష తదితరులు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలి



పంటను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయాధికారులు

ఉదయగిరి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజ్‌కుమార్, స్టేట్ రిసో ర్సుపర్సన్ మీరాబీలు సూచించారు. రైతుసేవా కేంద్రాల పరిధిలోని వీఏఏలు, వీహెచ్ఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణలో భాగంగా రెండోరోజైన శుక్రవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈసందర్భంగా మండలంలోని గండిపాళెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంతో సాగుచేసిన పంటలు, భూస్వభావాన్ని పరిశీలిం చారు. ఈకార్యక్రమంలో డివిజన్ మాస్టర్ ట్రైనర్ కె రామ్మోహన్‌రావు, మండల వ్యవసాయాధికారులు రామ్మో హన్, మదన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బ ంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు విద్యతోపాటు క్రమశిక్షణ నేర్పించాలి



పనులను పరిశీలిస్తున్న ఎంఈవో

ఉదయగిరి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులకు విద్యతోపాటు క్రమశిక్షణ నేర్పించాలని ఎంఈవో-2 శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని బీసీ కాలనీ ఉర్దూ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల అభ్యసన, పఠన సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లు పరిశీలించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మనబడి- మన భవిష్యత్తు పనులకు సంబంధించి నిధులు మంజూరు చేయించి అసంపూర్తి పను లను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయురాలు నూర్జహాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


గ్రామాల అభివృద్ధి ప్రణాళికపై అవగాహన



సిబ్బందితో సమీక్షిస్తున్న ఏపీఎం శారద్రవంతి

ఉదయగిరి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్త్రీశక్తి భవనంలో గ్రామాల అభివృద్ధి ప్రణాళికపై సీసీలు, వీవోఏలు, గ్రామ సంఘ అధ్యక్షులతో ఏపీఎం శారద్రవంతి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన అర్హతలు, హక్కులు, జీవనోపాదులు, ప్రభుత్వ ఆస్తులు, సామాజిక అభివృద్ధి ప్రణాళిక గురించి అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో ఆయా అంశాల్లో భాగంగా ప్రజలకు అవసరమైన సేవలను గుర్తించి గ్రామాల్లో నిర్వహించే గ్రామసభల్లో చర్చించి వాటి అభివృద్ధికి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో బాలగురవయ్య, సీసీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో ఐజాక్

అనంతసాగరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవనగరం, అనంతసాగరం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొలతల ప్రకారం పనిచేస్తే సగటు కూలీ రూ. 307 లభిస్తుందని సూచించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు.

ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలిక తల్లిదండ్రులకు అప్పగింత

కలువాయి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం సరిగాలేక ఇంటినుంచి వెళ్లిపోయిన బాలికను కలువాయి పోలీసులు ఐసీడీయస్ సిబ్బంది ద్వారా తల్లిదండ్రులకు శుక్రవారం అప్పగించారు. పోలీసుల సమాచారం మేరకు... కలువాయికి చెందిన మేడిబోయిన చంద్ర గత కొంతకాలంగా ఇందుకూరుపేటలో నివాసం ఉంటున్నారు. వారి కుమార్తె ప్రతిష్ఠ (14) 7వ తరగతి వరకు చదువుకుంది. మతిస్థిమితం సరిగాలేక ఈనెల 15వ తేదీ ఉదయం ఇందుకూరుపేటలోని ఇంటి నుంచి వెళ్లిపోయింది. మరుసటి రోజు ఈ బాలిక తిరుపతిలోని రైల్వేస్టేషన్‌లో తిరుగుతుండటంతో రైల్వే పోలీసులు గమనించి విచారించారు. బాలిక తనది కలువాయి అని చెప్పడంతో వారు బాలికను కలువాయికి తీసుకొచ్చి ఎస్ఐ కోటయ్య ఐసీడీయస్ సిబ్బంది ద్వారా తండ్రి చంద్రకు అప్పగించారు.

ఆత్మకూరు-సోమశిల రోడ్డు విస్తరణకు మార్గం సుగమం

● **రూ 25 కోట్లతో ప్రతిపాదనలు**

అనంతసాగరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఆత్మకూరు-సోమశిల రోడ్డు విస్తరణకు మార్గం సుగమమైంది. అభివృద్ధి పనులకు రూ. 25కోట్లు మంజూరుకు చర్యలు చేపట్టినట్లు ఇటీవల దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిదుల సమీకరణ కోసం ప్రతిపాదనలు చేశారు. ఈ రోడ్డు అభివృద్ధి పనులు పూర్తయితే ప్రయాణ కష్టాలు తీరనున్నాయి. భూముల ధరలు కూడా పెరిగే అవకాశం ఉంది. అలాగే అభివృద్ధి పనుల్లో భాగంగా సాగరం బస్టాండ్‌లో అడ్డంకులు తొలగించి రోడ్డు మధ్యలో డివైడర్ ఏర్పాటుచేసి విశాలంగా చేసేలా అధికారులు ప్రణాళికలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

డిప్యూటీ ఎంపీడీవోగా అమర్

చేజర్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండల డిప్యూటీ ఎంపీడీవోగా జి అమర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో కొడవలూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా విధులు నిర్వహిస్తూ డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి పొంది బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

న్యూస్ బాక్స్

శాకంబరి అలంకరణలో సంతానలక్ష్మి



ఉదయగిరి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ కాలనీ సమీపంలో ఉన్న సంతానలక్ష్మి అమ్మవారు ఆషాడ మాసం చివరి శుక్రవారం సందర్భంగా భక్తులకు శాకాంబరి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని కాయాకర్పూరం అందజేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థిక సాయం

అనంతసాగరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని పడమటి కంభంపాడుకు చెందిన షేక్ ఖాజావలికి హెల్పింగ్ హార్ట్ అసోసియేషన్ సభ్యులు చేయూతనిచ్చారు. మందుల ఖర్చులకు బాధితుడికి రూ. 15వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రొండా శ్రీనివాసులురెడ్డి, నరసింహారెడ్డి, మురళి, మల్లికార్జున పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

ఏఎస్ పేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): చిరమన జడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు కంచర్ల శేషయ్యనాయుడు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ నిర్వాహకులు అంకయ్యనాయుడు శుక్రవారం సన్మానించారు. ఈసందర్భంగా శ్రీదేవకుమార్, శ్రీనివాసులు, నరేంద్ర, మాలిని, ఖదీర్‌లను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వాణి, విద్యా కమిటీ చైర్మన్ కంచర్ల శ్రీధర్‌నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

CRIME NEWS

కట్టుకున్నోడినే కడతేర్చిన ఇల్లాలి అరెస్ట్

- ప్రియుడు కూడా కటకటాలపాలు
- వివాహేతర సంబంధంతోనే దారుణం
- 24 గంటల్లోనే కేసును ఛేదించిన రాపూరు పోలీసులు

రాపూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ప్రియుడి మోజులో పడి కట్టుకున్నోడినే కడతేర్చిన ఇల్లాలు చివరికి కటకటాలపాలైంది. రాపూరులో హత్య జరిగిన 24 గంటల్లోనే కేసును పోలీసులు ఛేదించారు. మృతుడి భార్యతోపాటు ప్రియుడిని అరెస్ట్ చేసినట్లు రాపూరు సీఐ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం సాయంత్రం రాపూరు పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఈ హత్య పూర్వాపరాలను సీఐ వెల్లడించారు.

రాపూరు దళితవాడలో ఉంటున్న లేబాకు శీనయ్య భార్య ధనమ్మకు పంగిలి గ్రామానికి చెందిన కునిపాక కల్యాణ్ మధ్య వివాహేతర సంబంధం ఉంది. తమ కలయికకు అడ్డుగా ఉన్నాడన్న నెపంతో శీనయ్యను హతమార్చాలని పన్నాగం పన్నారు. ఈ మేరకు బుధవారం రాత్రి శీనయ్య పూటుగా మద్యం సేవించి ఇంట్లో పడుకుని ఉండగా, ధనమ్మ తన ప్రియుడు కల్యాణ్‌కు ఫోన్ చేసి తెలిపింది. తాడు, ఆటో గేర్ వైర్‌ను తీసుకుని కల్యాణ్ ఇంటికి చేరుకున్నాడు. శీనయ్యను ఇద్దరు కలిసి కాళ్ళు చేతులు తాడుతో కట్టి నోట్లో గుడ్డను కుక్కి, ఆటో గేర్ వైర్‌తో మెడకు గట్టిగా బిగించి ఊపిరాడకుండా చంపేశారు. హత్యకు వినియోగించిన తాడు, ఆటో గేర్‌వైర్, గుడ్డను తగలబెట్టారు. శీనయ్య మరణాన్ని సహజ మరణంగా సృష్టించేందుకు గురువారం ఉదయం మృతుడి తల్లిదండ్రులకు శీనయ్య ఇంటిలో మద్యం తాగి తన తలను తలుపునకు, గోడకు కొట్టుకొని పడిపోయాడని నమ్మించేందుకు ప్రయత్నించింది. అయితే, కుమారుడి మరణంపై అనుమానంతో వారు ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు మృతుడి భార్య ధనమ్మను విచారించగా, అసలు విషయం బయటపడిందని చెప్పారు. నిందితులిద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించిన రాపూరు ఎస్ఐ వెంకట్ రాజేష్, కండలేరు డ్యాం ఎస్ఐ డి.రామకృష్ణ, పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు.

కారు బోల్తా : వీఆర్వోకు తీవ్ర గాయాలు

దుత్తలూరు (ఉదయగిరి), జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమలరేగడ గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వీఆర్వోకు తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల మేరకు.. ఉదయగిరి-2 వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న హజరత్‌మస్తాన్ విధులు ముగించుకుని స్వగ్రామమైన వరికుంటపాడు మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి తన బైక్‌పై బయలుదేరాడు. ఈ తరుణంలో సోమలరేగడ గ్రామ సమీపానికి రాగానే రోడ్డుపై గేదెలు అడ్డురావడంతో వాటిని ఢీకొని కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. అలాగే ఉదయగిరి పట్టణానికి చెందిన షేక్ మస్తాన్ తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో బుచ్చికి వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా అదే ప్రదేశంలో రోడ్డుపైకి ఆకస్మాత్తుగా గేదెలు రావడంతో వాటిని తప్పించబోయి కారు అదుపుతప్పి రోడ్డుపక్కనే ఉన్న గుంతలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మస్తాన్‌తోపాటు కుటుంబ సభ్యులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 వాహనానికి సమాచారం అందించడంతో వారిని చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వీఆర్వోను మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.

● **ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి**

సోమలరేగడ గ్రామ సమీపంలో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా అధికారులు నివారణ చర్యలు చేపట్టడం లేదు. అక్కడ జరిగిన ప్రమాదాల్లో ఇప్పటికే పలువురు మృత్యువాతపడగా, మరికొందరు క్షతగాత్రులై మంచానికే పరిమితమయ్యారు. జాతీయ రహదారి నిర్మాణం జరిగిన తరువాత రేయింబవళ్లు గేదెలు రోడ్డుపైనే సంచరిస్తున్నాయి. దీంతో వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా హైవే, పోలీసు అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

రౌడీషీటర్‌పై పీడీ యాక్ట్ : కడప జైలుకు తరలింపు

నెల్లూరు(క్రైం), జూలై 18(ఆంధ్రజ్యోతి) : వరుస నేరాలకు పాల్పడుతున్న రౌడీషీటర్ షేక్ యాసీర్‌పై కలెక్టర్ ఓ ఆనంద్ ఆదేశాలతో వేదాయపాలెం పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేశారు. పోలీసుల సమా చారం మేరకు... నగరంలోని వెంగళరావు నగర్‌కు చెందిన షేక్ యాసీర్‌పై వేదాయపాలెం పోలీసు స్టేషన్‌లో రౌడీ షీట్ ఉంది. కొట్లాట, బెదిరించి నగదు దోచుకోవడం, మారణాయుధాలతో దౌర్జన్యం చేయడం, హత్యాయ త్నం వంటి కేసులున్నాయి. ప్రస్తుతం అతను హత్యాయత్నం కేసులో జిల్లా కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్నాడు. పలుమార్లు పోలీసులు కౌన్సెలిం గ్ నిర్వహించినా అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో కలెక్టర్ ఆదేశా లతో పీడీ యాక్ట్ నమోదు చేశారు. శుక్రవారం యాసీర్‌ను కడప కేంద్ర కారాగారానికి తరలించారు.

కృష్ణపట్నం పోర్టులో కార్మికుడి మృతి

ముత్తుకూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : అదానీ కృష్ణపట్నం పోర్టులో ప్రమాదవశాత్తు శుక్రవారం ఓ కార్మికుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. కృష్ణపట్నం పోర్టులో ఐదో బెర్త్ సమీపంలో ఎస్ఎస్ స్టేషన్ వద్ద కాకినాడకు చెందిన కృష్ణయ్య (55) నీటి సంపులో పడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ జేపీ శ్రీనివాసులురెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. కృష్ణయ్య మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మద్యం మత్తులో ప్రమాదవశాత్తు జారిపడి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కృష్ణపట్నం పోర్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని

వృద్ధురాలి దుర్మరణం

● వాహనాలు తొక్కడంతో నుజ్జునుజ్జైన మృతదేహం



శేషమ్మ (ఫైల్)

కావలిరూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని కందిపాటి శేషమ్మ(84) మృతి చెందిన ఘటన శుక్రవారం తెల్లవారుజామున మండలంలోని గౌరవరం సమీపంలో జాతీయ రహదారిపై జరిగింది. రూరల్ పోలీసుల కథనం మేరకు.. గౌరవరం ఎస్సీ కాలనీకి చెందిన శేషమ్మ ఒంగోలులోని బంధువుల ఇంట జరిగే ఓ కార్యక్రమానికి వెళ్లేందుకు తెల్లవారుజామున ఆటోలో బయలుదేరింది. మార్గమధ్యంలోని బోగోలు మండలం సాంబశివపురం సమీపంలో మరికొందరి బంధువుల కోసం ఆటో దిగింది. ఆ రోడ్డులో బంధువులు లేకపోవడంతో అక్కడ నుంచి కావలి వెళ్లేందుకు ఆటో కోసం జాతీయ రహదారి దాటుతుండగా ఒంగోలు వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. రాత్రి సమయం కావడం, అదే సమయంలో వర్షం పడుతుండడంతో ఆ మృతదేహంపై వాహనాలు వెళ్లడంతో నుజ్జునుజ్జై గుర్తు పట్టలేని విధంగా మారింది. హైవే మొబైల్ సిబ్బంది గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతురాలి పళ్లు, మెడలో దారం ఆధారంగా మహిళగా గుర్తించి చుట్టుపక్క గ్రామాలకు సమాచారం ఇచ్చారు. గౌరవరానికి చెందిన శేషమ్మ గ్రామంలో లేకపోవడం, రైలు వద్దకు వెళ్లకపోవడంతో మృతి చెందినది శేషమ్మగా గుర్తించామని సీఐ రాజేశ్వరరావు తెలిపారు. మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించి ఎస్ఐ తిరుమలరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	120
స్కిన్ చికెన్	216
స్కిన్‌లెస్	240

కోడిగుడ్ల ధర (100): 520

పీ-4 ద్వారా పేద కుటుంబాల్లో వెలుగులు

కలిగిరి, జూలై 18(ఆంధ్రజ్యోతి): పీ-4 ద్వారా బంగారుకుటుంబాల భవిష్యత్ కోసం మండలంలోని తూర్పుగుడ్లదొన సచివాలయంలో శుక్రవారం అధికారులు గ్రామసభలు నిర్వహించారు. తూర్పు గుడ్లదొన, పడమర గుడ్లదొన, ఎరుకులరెడ్డిపాలెం గ్రామపంచాయతీలలో గుర్తించిన 155 బంగారుకుటుంబాల జాబితాను అధికారులు గ్రామస్థుల సమక్షంలో సమీక్షించారు. స్థానిక టీడీపీ నాయకుడు పట్నం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడి సెంటు భూమి లేని నిరుపేద కుటుంబాలను ఉన్నతస్థితిలోకి తీసుకురావాలన్నదే ప్రభుత్వ ఆశయమని, ముఖ్యమంత్రి చంద్రబాబు మానసపుత్రిక పీ-4 కార్యక్రమం నిరుపేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా మార్చి వారి జీవితాల్లో వెలుగులు నింపడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎరుకులరెడ్డిపాలెం గ్రామ సర్పంచు మేకల విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు పోకూరి సురేష్, ఏగూరి ప్రియాంక, రామాల హరితారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి

● మండల సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

గుడ్లూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పులి రమేష్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సచివాలయ ఉద్యోగుల్లో కొందరు అశ్రద్ధగా పనిచేస్తున్నారని, అలాంటి వారు తమ విధానాలను మార్చుకొని ప్రజల పట్ల అంకితభావంతో పనిచేయాన్నారు. ప్రతి గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా చూసుకోవాలని సూచించారు. పోట్లూరులో సక్రమంగా సైడుకాలువలు, ఇంకుడు గుంతలు లేక అపరిశుభ్రంగా ఉంటే అక్కడి సచివాలయ సిబ్బంది ఏం చేస్తున్నారని ఆగ్రహించారు. తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సమస్యలను వేగవంతగా పూర్తి చేయాలన్నారు. వైద్యాధికారులు ఆసుపత్రికే పరిమితం కాకుండా గ్రామాల్లో ప్రత్యేక క్యాంపులు పెట్టి ప్రజలకు వైద్యసదుపాయాలపై అవగాహన కల్పించాని ఎమ్మెల్యే సూచించారు. తమ గ్రామంలో గతంలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రాలేదని, కరెంట్ స్తంభాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చేవూరు సర్పంచు శెట్టిపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. ప్రత్యేకించి చేవూరులో కరెంట్ సమ్యలు అనేకం ఉన్నాయని వాటిని పరిష్కరించాలని కోరారు. వీరేపల్లి నుంచి పాజర్ల మీదిగా పోట్లూరు వరకు వచ్చే ఆర్టీసీ బస్సు ప్రస్తుతం రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పాజర్ల సర్పంచు పాటి వెంకటేశ్వర్లు తెలిపారు. ఇటీవల పాజర్లకు నూతనంగా వేసిన తారురోడ్డు ఒక కిలో మీటర్ మేర పనులు ఆగిపోయాయని, దీంతో ప్రజలు ఇబ్బందులుపడుతున్నారని, ఆపనులను తిరిగి ప్రారంభించాలని కోరారు. హౌసింగ్ ఏఈ గౌస్‌బాషా మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు పక్కాగృహాల జాబితా కూడా తయారు చేశామని, అప్పట్లో పెండింగ్ ఉన్న వారికి కూడా నగదు ప్రభుత్వం నుంచే అందేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరావు, ఎంఈవో గోవర్ధన్, పశువైద్యాధికారి మహ్మద్ అలీ, వైద్యఆరోగ్య కేంద్రం డాక్టర్ సాయిప్రియాంక, సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

డయల్-112తో తక్షణ సహాయం

కావలిరూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయాల్లో పోలీస్ సత్వర సహాయం కోరుకునే పౌరులు 112కు డయల్ చేయాలని కావలి రూరల్ సీఐ జీ.రాజేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, 112 కాల్స్ అత్యవసర సేవల కోసం జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పట్టణంలోని 1వ, 2వ, రూరల్ పోలీస్ స్టేషన్లకు 3 బైకులు కేటాయించారన్నారు. ఈ బైకులపై 2 రోజులుగా పోలీసులు పట్టణంలో సైరన్‌లతో చెక్కర్లు కొడుతూ ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడుతున్నారన్నారు.

535 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, జూలై 18(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు మొత్తం 634 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 11కంపెనీల ప్రతినిధులు పాల్గొని 535 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-73, ఆర్‌ఆర్-4, సీఆర్-17, జంపింగ్‌లాట్స్-5 కారణాలతో 99బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సగటు ధర రూ.205.78గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

సమష్టిగా పని చేద్దాం : ఎమ్మెల్యే కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గదుమాటి వెంకట కృష్ణారెడ్డి

అల్లూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నాయకులు, కార్యకర్తల్లో ఉన్న భేదాభిప్రాయాలను వీడి అందరం కలసికట్టుగా పనిచేసి ముఖ్యమంత్రి మానసపుత్రిక సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి అన్నారు. అల్లూరు డీఎస్‌ఆర్ ట్రస్ట్ వేడుక మందిరంలో శుక్రవారం రాత్రి మండల నాయకులు, కార్యకర్తలతో కలసి సుపరిపాలనలో తొలిఅడుగుపై ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్తను, నాయకుడిని టీడీపీ అధిష్ఠానం గుర్తించి వారికి న్యాయం చేస్తుందని, ఎవ్వరూ నిరాశ చెందాల్సిన అవసరం లేదన్నారు. భవిష్యత్తులో కార్యకర్తలకు పెద్దపీట వేయబోతోందన్నారు. ఇప్పటి వరకు జరిగగిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను, ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులను సైతం ప్రభుత్వ దృష్టికి తీసుకురావడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. అందుకు తగ్గట్టుగా ఈ కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీద గిరిధర్, బండి శ్రీనివాసులురెడ్డి , కృష్ణచైతన్య, పోలిశెట్టి, నీలప రెడ్డి హరీష్‌రెడ్డి, రేబాల శంకర్‌రెడ్డి, బిట్రగుంట చైతన్యరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు అండగా నిలవాలి

● డీఎస్పీ శ్రీధర్‌ను సత్కరించిన రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యులు


డీఎస్పీ శ్రీధర్‌ను సత్కరిస్తున్న రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యులు

కావలి, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : తలసేమియా బాధిత చిన్నారులకు అండగా నిలవాలని డీఎస్పీ పీ.శ్రీధర్‌ను రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యులు కోరారు. శుక్రవారం వారు డీఎస్పీ కార్యాలయంలో ఆయనను కలిసి ఇప్పటి వరకు కావలి సబ్‌డివిజన్‌లో రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తకేంద్రానికి అండగా నిలుస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను సత్కరించి మెమెంటో అందజేశారు. గత ఆరు నెలలుగా తలసేమియా డేకేర్ సెంటర్ చిన్నారులకు అందచేస్తున్న సేవలను గురించి మెడికల్ ఆఫీసర్ పాములూరు శ్రీధర్ వివరించారు. ప్రతి చిన్నారికి రెండు లేదా మూడు వారాలకు ఒకసారి ఉచితంగా రక్తం ఎక్కించడంతో పాటు మందులు, పౌష్టికాహారంను దాతల సహకారంతో అందిస్తున్నామని చెప్పారు. అలాగే పట్టణంలోని పలువురు వైద్యులు చిన్నారులకు అవసరమైన స్కాన్‌లు, ఇతర పరీక్షలను ఉచితంగా చేస్తున్నారన్నారు. తాము నిర్వహిస్తున్న తలసేమియా డేకేర్ సెంటర్‌ను సందర్శించాలని కోరారు. దీనిపై స్పందించి డీఎస్పీ స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్న రెడ్‌క్రాస్‌కు తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డీ.రవిప్రకాష్, వైస్‌చైర్మన్ కే.హరినారపరెడ్డి, కోశాధికారి ఆరికట్ల మధుసూదనరావు, సభ్యులు ఓరుగంటి వెంకటేశ్వర్లు, జనిగర్ల మనోహర్, గొట్టిపాటి మనోరమ, డేకేర్ సెంటర్ సబ్‌కమిటీ సభ్యులు కల్లయ్య పాల్గొన్నారు.

బీజేపీ పటిష్టత, మున్సిపల్ ఎన్నికలపై సమాలోచనలు


మాట్లాడుతున్న బీజేపీ నేత భరత్‌కుమార్

కావలి(టౌన్), జూలై 18(ఆంధ్రజ్యోతి) : పట్టణంలో బీజేపీని క్షేత్రస్థాయిలో పటిష్ఠ పరిచి రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై శుక్రవారం నేతలు సమాలోచనలు చేశారు. పట్టణ అధ్యక్షుడు మంద కిరణ్‌కుమార్ అధ్యక్షతన స్థానిక పార్టీ కార్యాలయంలో నేతలు సమావేశమై మున్సిపల్ ఎన్నికల్లో కూటమి భాగస్వామ్యంలో పార్టీకి ఎన్ని కౌన్సిలర్ సీట్లు అడగాలి, ఏ వార్డులు కోరుకోవాలి, ఆయా ప్రాంతాల్లో పోటీ చేసేందుకు సమర్థవంతమైన నాయకులెవరున్నారు, పోటీకి ఆసక్తికనబరిచే నేతలు తదితర విషయాలపై చర్చించారు. ఈనెల 27న జరిగే మన్‌కీబాత్ కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఏర్పాట్లపై చర్చించారు. సమావేశంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు భరత్‌కుమార్, నాయకులు సీవీసీ సత్యం, బ్రహ్మానందం, వీవీ రంగారెడ్డి, అమరా సుబ్బారావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

దగదర్తి(బిట్రగుంట), జూలై 18(ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం సిద్ధారెడ్డిపాలెంకు చెందిన భుక్య జనార్దన్‌నాయక్(35) ప్రమాదవశాత్తు గాయపడి నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఎస్‌ఐ జంపాని కుమార్ కథనం మేరకు.. జనార్దన్ తన స్వగ్రామంలో గురువారం మోటర్ సైకిల్‌పై వెళుతుండగా వీధి కుక్క అడ్డంగా రాగా దానిని తప్పించబోయి అదుపు తప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తలకు గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లగా చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఏఎంసీకి తొలి మహిళా చైర్‌పర్సన్‌గా అలేఖ్య



కావలి, జూలై 18(ఆంధ్రజ్యోతి) : కావలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య నియమితులు రికార్డు సాధించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఎంతో మంది ఏఎంసీ చైర్మన్లుగా పనిచేసినా వారంతా పురుషులే. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏఎంసీ చైర్మన్లకు కూడా మహిళా రిజర్వేషన్ కల్పించడంతో మహిళా కోటా కింద అలేఖ్యకు పదవి దక్కింది. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అలేఖ్య పేరును చైర్మన్ పదవికి ప్రతిపాదించగా ప్రభుత్వం ఆమోదించింది. అయితే గతంలో అలేఖ్య తండ్రి గ్రంధి యానాదిశెట్టి కూడా తొలుత కావలి మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసి తర్వాత కావలి ఏఎంసీ చైర్మన్‌గా పని చేశారు. అలాగే ఆయన తనయ పోతుగంటి అలేఖ్య కూడా తొలుత మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పనిచేసి ప్రస్తుతం ఏఎంసీ చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. తండ్రి తనయలు అదే పదవులు వరుసగా చేయడం చూస్తే వారసత్వ హక్కులుగా పదవులు కనిపిస్తున్నాయి. అయితే ఇప్పటి వరకు ఏఎంసీ చైర్మన్లుగా పనిచేసిన వారు ఎవరు కూడా ఆతర్వాత రాజకీయంగా పెద్దగా ఎదిగిన దాఖలాలు లేవు. పిన్న వయస్సులోనే చైర్మన్ పదవి పొందిన అలేఖ్య పాత సెంటిమెంట్‌ను అతిక్రమించి రాజకీయంగా ఎదుగుతోందని భావిద్దాం. కాగా ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన అలేఖ్యకు టీడీపీ నేతలతో పాటు పలువురు పట్టణ ప్రముఖులు శుక్రవారం ఆమె నివాసంలో కలిసి అభినందనలు తెలిపారు. అలాగే తనకు పదవి రావడానికి కృషి చేసిన కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డిని అలేఖ్య కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఏరియా ఆసుపత్రికి సామగ్రి వితరణ


ఆసుపత్రికి వీల్‌చైర్లు, స్ట్రక్చర్లు అందజేస్తున్న దాతలు

కందుకూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): కందుకూరు ఏరియా ఆసుపత్రికిలో రోగుల అవసరాల నిమిత్తం బడేవారిపాలెం గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ ఉన్నం నిషికిల్ చౌదరి రూ.60వేలు విలువజేసే 4 వీల్‌చైర్లు, 2 స్ట్రక్చర్లు, 14 సెలైన్‌స్టాండ్లు, నాలుగు బీపీ ఆపరేట్ పరికరాలను వితరణ చేశారు. శుక్రవారం వీటిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శకుంతలకు అందజేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తన తండ్రి ఉన్నం శ్రీనివాసులు జ్ఞాపకార్థం నిషికల్‌చౌదరి వీటిని అందజేశారు. సుపత్రికి వచ్చే రోగులు కనీస సదుపాయాలు లేక అవస్థలు పడుతున్న విషయాన్ని గుర్తించి తన సోదరుడు, టీడీపీ నాయకుడు గొట్టిపాటి హరికృష్ణ సూచనతో వీటిని అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు వెంకటరెడ్డి, వెంకటనరసమ్మ, సిబ్బంది సుజాత, రాజేష్, చిట్టిబాబు, ప్రమీల, చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు సమస్త జీవకోటికి ప్రాణాధారం


మొక్క నాటుతున్న సీఐ వెంకటనారాయణ, తదితరులు

కలిగిరి, జూలై 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో శుక్రవారం సంయుక్త సేవాసంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ వెంకటనారాయణ మాట్లాడుతూ మొక్కలు పర్యావరణాని రక్షించడంతోపాటు సమస్త జీవకోటికి ప్రాణాధారమన్నారు. ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యతలు చేపట్టాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఏ శ్రీను, ఎంఈవో సురేష్, ఎస్‌ఎంసీ చైర్మన్ వీ కొండారెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, సేవాసంస్థ సభ్యులు, ఎన్‌సీసీ విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యం

వలేటివారిపాలెం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని చుండిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల కరపత్రాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మాలకొండ దేవస్థానం మాజీ చైర్మన్ చెరువుపల్లి మాల్యాద్రి, నాయకులు కామినేని వీరయ్య, కామినేని అశోక్, చెరువుపల్లి సాంబశివరావు, చొప్పర రాఘవులు, మేకల అశోక్, చొప్పర చినబ్రహ్మయ్య తదితరు లు పాల్గొన్నారు.

చేతిపంపులకు మరమ్మతులు చేయాలి


చేతి పంపునకు మరమ్మతులు చేయిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసులు

లింగసముద్రం, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో మరమ్మతులకు గురైన చేతిపంపులు గుర్తించి తక్షణం మరమ్మతులు చేయించేందుకు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది చర్యలు తీసుకోవాల ని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు చెప్పారు. శుక్రవారం సాయంత్రం లింగసముద్రంలో మరమ్మతులకు గురైన చేతిపంపును ఆయన దగ్గరుండి బాగు చేయించారు. చేతిపంపులు చెడి పోయినప్పుడు ప్రజలు కూడా సిబ్బందికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం మాధవరావు, సిబ్బంది శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

కావలి(టౌన్), జూలై 18(ఆంధ్రజ్యోతి) : అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవనం నిర్మాణానికి అమరావతిలో 6.8 ఎకరాల భూమిని కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ తటవర్తి వాసు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్యవైశ్య కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేష్ నాయకత్వంలో తాము గతంలో చంద్రబాబును కలిసి శ్రీరాములు స్మారక భవన నిర్మాణానికి భూమి కేటాయించాలని విన్నవించామన్నారు. ఆయన ఆదేశాలతో భూమి పత్రాలను మంత్రి పీ నారాయణ చేతులమీదుగా దూండి రాకేష్‌కు అందించారన్నారు. ప్రభుత్వ నిర్ణయంపై ఆర్యవైశ్యుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయన్నారు. కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఆర్యవైశ్యులకు పూర్తిస్థాయిలో అండదండలందిస్తున్నారని, సంస్కృతి సంప్రదాయాలకు ప్రత్యేక విలువ ఇస్తూ తమ సంక్షేమానికి కృషి చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.

ఓ మోస్తరు వర్షం

బిట్రగుంట, జూలై 18(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో శుక్రవారం ఉదయం నుంచి ఎడతీవ్రత తగ్గడమే కాకుండా మధ్యాహ్నం ఓమోస్తరు వర్షం కురిసింది. ఇటీవల తీవ్రమైన ఎండలకు విసిగివేసారిన ప్రజలకు వర్షం కురవడంతో కాస్త ఉపసమనం కలిగింది.

విద్యార్థినులకు గుడ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ ప్రభాకర్‌రావు

బిట్రగుంట, జూలై 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని తిప్ప ఎస్‌ఐ ఎన్.ప్రభాకర్‌రావు తెలిపారు. శుక్రవారం మండలంలోని ముంగమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు నడుచుకోవాల్సిన విధానంపై వివరించారు. ఎవరైనా అసభ్యంగా, ఇబ్బందికరంగా ప్రవర్తిస్తే తల్లితండ్రులు, పెద్దలు, ఉపాధ్యాయుల దృష్టికి తీసుకుపోవాలని సూచించారు. ఇరతరులతో అతిచనువు మంచిది కాదన్నారు. ముఖ్యంగా సెల్‌ఫోన్ల వాడకంపై కాకుండా చదువుపై దృష్టి ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థలకు ప్రాధాన్యత

(5వ పేజీ తరువాయి)

మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలుపుతూ సభలో తీర్మానం చేయాలని కావలి ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి కోరారు. ఈ తీర్మానాన్ని ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, నెలవల విజయశ్రీలు బలపరచగా, ఆమోదిస్తున్నట్లు చైర్‌పర్సన్ అరుణమ్మ ప్రకటించారు.

● తల్లికి వందనంపై స్పెషల్ డ్రైవ్ : కలెక్టర్

'పాఠశాల స్థాయిలోనే విద్యార్థి వివరాలను యూడీస్ వెబ్‌సైట్‌లో నమోదు చేస్తే ఆటోమేటిక్‌గా తల్లికి వందనం పథకానికి అర్హత గుర్తిస్తున్నారు. అయితే కొన్ని ప్రైవేటు పాఠశాలలు విద్యార్థుల వివరాలను ఎంట్రీ చేయడంలో ఆలస్యం చేస్తున్నట్లు గుర్తించాం. అటువంటి పాఠశాలలపై స్పెషల్ డ్రైవ్ పెడతాం. తల్లికి వందనం పథకానికి సంబంధించి జిల్లాలో 1500 వరకూ గ్రీవెన్స్ వచ్చాయి. వాటిని పరిశీలిస్తున్నాం.' అని కలెక్టర్ ఆనంద్ అన్నారు.

● పలు అంశాలపై ఎమ్మెల్యేల నిలదీత

ఇళ్లకు కొత్తగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ మీటర్లతో ఎక్కువ బిల్లులు వస్తున్నాయని మునుపటితో పోలిస్తే 20 శాతం వరకూ ఎక్కువ యూనిట్లు వాడినట్లు వస్తోందని కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి అన్నారు. కొత్త మీటర్లు ఏర్పాటు సమయంలోనే కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు ఎందుకు తెలియజేయడం లేదని ఆయన ప్రశ్నించారు. దశాబ్దాల క్రితం వేసిన విద్యుత్ స్తంభాలే నేటికీ ఉన్నాయని వీటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాని కోరారు. గత ప్రభుత్వంలో ఏఎంసీ నిధులతో చేపట్టిన రోడ్డు పనులు ఎంతవరకు వచ్చాయని ఉదయగిరి ఎమ్మెల్యే కాకార్ల సురేష్ ప్రశ్నించారు. తల్లికి వందనం పథకం వివరాలను కూడా సభ ముందు ఉంచితే బాగుండేదని సూచించారు. చిల్లకూరు మండలం పొన్నపువారిపాలెం రోడ్డుకు అటవీ అనుమతులు వచ్చాయని, త్వరగా ఎస్టిమేషన్లు వేసి పంపాలని పీఆర్ అధికారులను ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి కోరారు. పాఠశాలల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని సూచించారు. డీపీఆర్‌సీ భవనాల నిర్మాణానికి నాలుగు నెలల క్రితం అనుమతులిస్తే ఇంతవరకూ ఎందుకు టెండర్లు పిలవలేదని చైర్‌పర్సన్ పంచాయతీ రాజ్ అధికారులను ప్రశ్నించారు. సౌత్‌మోపూరు హైస్కూల్ ప్రహరీ శంకుస్థాపన సమయంలో ప్రొటోకాల్ ఉల్లంఘన జరిగిందని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా వెంగమాంబ ఉత్సవాలలో అధికారులు తమను గౌరవించకుండా ప్రొటోకాల్ ఉల్లంఘించారని దుత్తలూరు జడ్పీటీసీ మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆనం.. వెంటనే ఈ ఫిర్యాదుపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని దేవదాయ శాఖ అధికారులను ఆదేశించారు.

విద్యార్థులకు బ్యాగులు, నోటు పుస్తకాల పంపిణీ



విద్యార్థికి బ్యాగు అందజేస్తున్న సబ్ కలెక్టరు శ్రీపూజ

కందుకూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): కందుకూరు ప్రాంతంలోని 57 మంది నిరుపేద విద్యార్థులకు వరల్డ్‌విజన్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. స్థానిక పద్మావతి ఫంక్షన్‌హాలులో నిర్వహించిన కార్యక్రమంలో సబ్ కలెక్టరు తిరుమాణి శ్రీపూజ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టరు మాట్లాడుతూ పదవ తరగతికి వచ్చే సమయానికే విద్యార్థులు తమ లక్ష్యం పట్ల స్పష్టత కలిగి ఉండటం ద్వారా సాధించవచ్చునని ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో వరల్డ్‌విజన్ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరా పునరుద్ధరణ

లింగసముద్రం, జూలై 18(ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు-రేళ్లపాడు మంచినీటి పథకం నుంచి అధికారులు శుక్రవారం సాయంత్రం మంచినీటి సరఫరాను పునరుద్ధరించారు. గత బుధవారం నుంచి ఈ పథకంకు చెందిన ట్రీట్‌మెంట్ వాటర్ ప్లాంటును సిబ్బంది శుభ్రం చేస్తున్న విషయం తెలిసిందే. అప్పటి నుంచి మంచినీటి సరఫరా నిలిపివేశారు. దీంతో మూడు రోజుల నుంచి ఇబ్బందులు పడ్డ ప్రజలు, మంచినీటి సరఫరా పునరుద్ధరణతో ఆనందరం వ్యక్తం చేస్తున్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

బిట్రగుంట, జూలై 18(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో చెన్నైకి చెందిన ప్రముఖ ఆయుర్వేద నిపుణుడు డాక్టర్ పెంచలరావుచే ఉచిత ఆయుర్వేద, మర్మకళ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు బాలాజీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో మైగ్రెన్, సైనసైటిస్, మెడ, భుజాలు, వెన్నుముఖ, నడు ము ఇతర నొప్పులకు ఆయుర్వేద వైద్య పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి సాయత్రం 5 గంటల వరకు వైద్య పరీక్షలు చేసి ఉచిత మందులు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

విద్యార్థులకు విద్యా ఉపకరణాల పంపిణీ

కావలి, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని నడింపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం పట్టణంలోని సెవన్‌లైన్స్ సభ్యులు నోట్‌పుస్తకాలు, పలకలు, జామెంటీ బ్రాక్స్‌లు తదితర విద్యా ఉపకరణాలు, తినుబండారాలు పంపిణీ చేశారు. ఆ పాఠశాల ఉపాధ్యాయులు శానం కృష్ణ, మధుసూదనరావులు సూచనల మేరకు ఎస్సీ ఎస్టీ విద్యార్థులు ఎక్కువగా ఉండే ఆ పాఠశాలకు విద్యా ఉపకరణాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెవెన్‌లైన్స్ సభ్యులు గాదంశెట్టి వేణుగోపాల్, పాదర్తి నాగరాజు, పెనల పవన్, సువర్ణ శ్రీనివాసులు, పేరూరు శంకర్, పెట్టుగాని రమేష్, రాజా సుబ్బారావు, శేగు రంగం, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


నడిమిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యా ఉపకరణాలతో విద్యార్థులు, దాతలు, ఉపాధ్యాయులు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 తిరుపతి
జిల్లా వార్తలు
శనివారం 19 జూలై 2025

3.45: పోలీస్ పరేడ్ మైదానంలో ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొంటారు.





అధికార పార్టీకి జిల్లాలో సమర్థ నాయకత్వం కొరత స్పష్టంగా కనిపిస్తోంది. దీని ప్రభావమూ క్షేత్రస్థాయిలో శ్రేణులపై పడుతోంది. ఈ క్రమంలో సొంత జిల్లాలో పార్టీ బలోపేతానికి అధినేత చంద్రబాబు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని నాయకులు, శ్రేణులు భావిస్తున్నాయి. శనివారం జిల్లాలో అధికారిక పర్యటనకు వస్తున్న సీఎం చంద్రబాబు.. కొంత సమయం పార్టీపైనా దృష్టి పెట్టి నేతలకు దిశానిర్దేశం చేయడంతో పాటు నాయకత్వ కొరత సమస్యను అధిగమించేలా నిర్ణయాలు తీసుకోవాలని శ్రేణులు కోరుతున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

తిరుపతి, సత్యవేడు సెగ్మెంట్లలోనూ అదే పరిస్థితి

పదవుల భర్తీలో జాప్యంతో ఆశావహుల్లో అసంతృప్తి

బాబు గారూ.. దృష్టి పెడతారా?

జిల్లా టీడీపీకి సమర్థ నాయకత్వమేదీ?

తిరుపతి జిల్లా ఏర్పడి మూడేళ్లు దాటింది. జిల్లా అభివృద్ధికి తగిన దిశా నిర్దేశం చేయడానికి, ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకోవడానికి, మిత్ర పక్షాలను కలుపుకుని పోవడానికి తగిన బలమైన నాయకులంటూ లేకపోతున్నారు. ఇదివరకు మాజీ మంత్రులు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, గాలి ముద్దుకృష్ణమనాయుడు వంటి నేతలు జిల్లాపై సమగ్రమైన అవగాహనతో పాటు పట్టు కలిగి ఉండేవారు. వారి తరం గడచిపోవడంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి, పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి జిల్లా నేతలుగా ఎదిగారు. వారికి మంత్రి పదవులు దక్కకపోవడంతో నిరాశ నిస్పృహలతో తమ నియోజకవర్గాలకే పరిమితమయ్యారు. ఫలితంగా తిరుపతి జిల్లా అనే కాకుండా మొత్తం ఉమ్మడి జిల్లాకే నాయకత్వం లేకుండాపోయింది. జిల్లా అభివృద్ధి విషయంలో ప్రభుత్వానికి ప్రతిపాదించడం నుంచీ పార్టీ శ్రేణుల సమస్యల వరకూ పట్టించుకునే వారు లేకుండాపోయారు. ఎమ్మెల్యేలలో ఎక్కువమంది తొలిసారి గెలిచిన వారు కావడంతో జిల్లాస్థాయిలో ప్రభావం చూపించే పరిస్థితి లేదు.



11.30: రేణిగుంట మండలం తూకివాకంలో తిరుపతి కార్పొరేషన్‌కు చెందిన ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజిమెంట్ ప్లాంట్ సందర్శన.

జిల్లా కేంద్రంలోనూ అదే పరిస్థితి

తిరుపతిలోనూ టీడీపీని నాయకత్వ కొరత పట్టి పీడిస్తోంది. తిరుపతి ఎమ్మెల్యే ఉన్నా, పార్టీపరంగా జనసేనకు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ఎమ్మెల్యే పదవి లేకపోవడంతో పాటు పార్టీకి కూడా బలమైన నాయకత్వం లేకపోవడం టీడీపీని బలహీనపరుస్తోంది. ఉన్నంతలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ పార్టీని నెట్టుకొస్తున్నారు. నిజానికి ఆమెది రాజకీయ నేపథ్యమున్న కుటుంబం. గతంలో ఆమె భర్త, ఆమె కూడా తిరుపతి ఎమ్మెల్యేలుగా పనిచేసిన వారే. సుదీర్ఘ రాజకీయ అనుభవం, అవగాహన ఉన్నప్పటికీ ఆమె తిరుపతి టీడీపీపై పూర్తిస్థాయిలో పట్టు సాధించలేకపోతున్నారు. రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవి ఇచ్చినా తిరుపతిలో అధికార యంత్రాంగం మీద పట్టు రావడం లేదు. దీంతో నామినేటెడ్ పదవులకు, ఇతర పనులకు నాయకులు ఎవరిని ఆశ్రయించాలో తోచక సతమతమవుతున్నాయి. రాష్ట్రంలోనే అతి కీలకమైన తిరుపతిలో పార్టీ దారీ తెన్నూలేని స్థితికి చేరుకోవడం శ్రేణులను ఆవేదనకు గురి చేస్తోంది.



మధ్యాహ్నం 12.15: తిరుపతి కపిలతీర్థంలో కపిలేశ్వరస్వామి దర్శనం. అక్కడే 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' వాటాదారులతో ముఖాముఖి.

1.15: పోలీస్ పరేడ్ మైదానం చేరుకుని భోజనం చేసి కొంతసేపు విశ్రాంతి తీసుకుంటారు.

సత్యవేడులోనూ నాయకత్వ కొరత

సత్యవేడు నియోజకవర్గంలోనూ నాయకత్వ సమస్య తలెత్తింది. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పార్టీ నుంచీ సస్పెండ్ కావడంతో పార్టీకి సుమారు తొమ్మిది నెలల పాటు నాయకత్వం లేకుండా పోయింది. ఇటీవల ఓ నిర్మాణ సంస్థ అధినేత కూరపాటి శంకర్‌రెడ్డిని కో ఆర్డినేటర్‌గా నియమించినా అక్కడ పార్టీ వ్యవహారాలు ఇంకా గాడిలో పడలేదు. ఎమ్మెల్యే ఆదిమూలం చాలా చురుగ్గా వ్యవహరిస్తున్నారు. నిత్యం ప్రజల మధ్యే తిరుగుతున్నారు. ప్రజలు, శ్రేణులు, అధికారులు తనను విస్మరించే అవకాశం ఇవ్వకుండా నియోజకవర్గాన్ని చుట్టేస్తున్నారు. ఆయన విషయంలో స్పష్టమైన నిర్ణయం తీసుకోకుండానే కో ఆర్డినేటర్‌ను నియమించడంతో వివాదాలు తలెత్తుతున్నాయి. అధికార యంత్రాంగానికి కూడా ఎవరితో ఎలా వ్యవహరించాలో తెలియడం లేదు. రిజర్వుడు నియోజకవర్గం కావడం, ఎమ్మెల్యేని నిర్లక్ష్యం చేస్తే ఏమవుతుందోనన్న సంశయం అధికారులను వెంటాడుతోంది. శంకర్‌రెడ్డికి ప్రొటోకాల్ ఉండే పదవిస్తే సాంకేతికంగా కొంత సానుకూలత ఏర్పడనుంది.

నామినేటెడ్ పదవుల భర్తీలో జాప్యంతో అసంతృప్తి

జిల్లాలో ఇంకా అనేక నామినేటెడ్ పదవులు భర్తీ కాలేదు. ఇంకొన్ని మార్కెట్ కమిటీలు, ఆలయ పాలకమండళ్లతో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్ష పదవి కూడా వుంది. వీటికోసం ఏడాదిగా వేచి చూస్తున్న ఆశావహుల్లో.. జాప్యం జరిగే కొద్దీ అసంతృప్తి కలుగుతోంది. సీఎం చంద్రబాబు వీటిపై దృష్టి సారించి నామినేటెడ్ పదవులను త్వరగా భర్తీ చేయడంతో పాటు జిల్లా పార్టీలో నాయకత్వ కొరత లేకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

నియోజకవర్గాల వారీగా చూస్తే..

శ్రీకాళహస్తి: దేశవ్యాప్తంగా పేరు ప్రతిష్ఠలున్న ముక్కంటి ఆలయానికి ఇంకా పాలకమండలిని నియమించలేదు. అత్యంత ప్రాచీన ఆలయమైన గుడిమల్లం పరశురామేశ్వరాలయానిదీ అదే పరిస్థితి. శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీకి కూడా పాలకవర్గం లేదు.

తిరుపతి: తాతయ్యగుంట గంగమ్మ గుడి పాలకమండలి ఛైర్మన్ పదవికి బాగా పోటీ ఉంది.దీనినీ భర్తీ దీనికీ పాలకమండలి ఏర్పాటు కాలేదు. **చంద్రగిరి:** తలకోన సిద్ధేశ్వరాలయం, పాకాల ఆనందగిరి సుబ్రమణ్యస్వామి ఆలయం,చంద్రగిరి మూలస్థాన ఎల్లమ్మ ఆలయాలకు కమిటీల్లేవు. **సత్యవేడు:** నాగలాపురం, బీఎన్ కండ్రిగ వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఖాళీగానే ఉన్నాయి. సురుటిపల్లి పల్లికొండేశ్వరాలయ ట్రస్టు బోర్డు కూడా ఏర్పాటు కాలేదు. **సూళ్లూరుపేట:** చెంగాలమ్మ ఆలయానికీ పాలకవర్గం ఏర్పాటు చేయలేదు. **వెంకటగిరి:** పోలేరమ్మ ఆలయానికి పాలక మండలి నియమించాల్సి ఉంది. **గూడూరు:** చిల్లకూరు మండలం తూర్పు కనుపూరులోని ముత్యాలమ్మ ఆలయం కూడా పాలక మండలికి నోచుకోలేదు.

నేడు తిరుపతికి సీఎం రాక

తిరుపతి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రతినెలా మూడో శనివారం జరిగే 'స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈసారి సీఎం చంద్రబాబు తిరుపతికి వస్తున్నారు. ఉదయం 11 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకునే ఆయన మొత్తం నాలుగు కార్యక్రమాల్లో పాల్గొని సాయంత్రం 5 గంటలకు తిరుగు ప్రయాణం కానున్నారు. కాగా, తొలుత ఖరారైన షెడ్యూలులో మళ్ళీ మార్పులు జరిగాయి. తిరుపతిలో కార్యక్రమాలు ముగించుకుని ఏర్పేడు సమీపంలోని ఐఐటీకి చేరుకుని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను సీఎం ప్రారంభించాల్సి వుంది. అక్కడి నుంచే అనంతపురం హబ్‌నూ వర్చువల్‌గా ప్రారంభించాలి. కానీ, చివరగా సీఎంవో నుంచీ విడుదల చేసిన షెడ్యూలులో ఆ కార్యక్రమాన్ని చేర్చలేదు. దీంతో ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం వాయిదా పడినట్లయింది. సీఎం చంద్రబాబుకు పర్యటనలో పాల్గొనేందుకు.. ఏర్పాట్ల పరిశీలనకు శుక్రవారం సాయంత్రమే రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తిరుపతి చేరుకున్నారు.

● రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం వాయిదా

సాయంత్రం 4 గంటలు: అలిపిరి వద్ద ఉన్న కంచి కామకోటి పీఠానికి చెందిన మఠానికి చేరుకుని కంచి స్వాములతో సమావేశమవుతారు. 4.30 గంటలకు విమానాశ్రయానికి బయలుదేరతారు.

5.00: రేణిగుంట విమానాశ్రయం నుంచి విజయవాడుకు తిరుగు ప్రయాణం.



మృతి చెందిన జింక

అలిపిరి వద్ద కుక్కల దాడిలో జింక మృతి

తిరుమల, జూలై18(ఆంధ్రజ్యోతి): అలిపిరి చెక్‌పాయింట్ సమీపంలో శుక్రవారం తెల్లవారు జామున కుక్కల దాడిలో జింక మృతి చెందింది. పొట్ట భాగంలో గాయాలతో మృతి చెంది పడివున్న జింకను చూసి తొలత చిరుత దాడిగా భావించారు. అయితే చిరుత దాడి చేస్తే మెడ భాగాన్ని నోటకరుచుకుని ఆ తర్వాత అడవిలోకి తీసుకెళ్లి తింటుందని, జింక పొట్టపై గాయాన్ని చూస్తే కుక్కలు దాడి చేసినట్టుగా ఉందని అటవీ అధికారులు చెప్పారు. అయినప్పటికీ విజిలెన్స్ అధికారులు భక్తులను అప్రమత్తం చేసి తిరుమలకు పంపారు.

పాత భవనాలు సిద్ధం చేయండి

● అధికారులను ఆదేశించిన ఈవో శ్యామలరావు


తిరుమల, జూలై18(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని పాత భవనాలను తగిన రిపేర్లతో ఉపయోగంలోకి తీసుకురావాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. నిరుపయోగంగా ఉన్న అన్నపూర్ణ క్యాంటీన్ భవనాన్ని శుక్రవారం ఉదయం అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి ఈవో పరిశీలించారు. హెచ్‌వీడీసీ, బాలాజీ నిలయం, తిరుమల మందిరం(ఆంప్రో రెస్ట్ హౌస్) విశ్రాంతి భవనాలను కూడా పరిశీలించారు. సీఈ సత్యనారాయణ, ఈఈ వేణుగోపాల్, డిప్యూటీ ఈవో భాస్కర్, రెవిన్యూ డిప్యూటీ ఈవో వెంకటేశ్వర్లు ఈవో వెంట ఉన్నారు.

తిరుమలలో నటి ప్రగ్యానయాన్



తిరుమల, జూలై18 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం సినీనటి ప్రగ్యా నయాన్, ఎంహెచ్‌సీ ప్లాంటేషన్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్ కింగ్ థిన్, ఎమ్మెల్యేలు ఆదిమూలం, బొలిశెట్టి శ్రీనివాస్ దర్శించుకున్నారు.

సర్వదర్శనానికి 16 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని తొమ్మిది షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ దాకా ఉంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.66 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,897

తలనీలాలు సమర్పించినవారు: 29,500

శభాష్.. హరీశ్..!

● పాయింట్స్‌మన్‌కు డీఆర్‌ఎం అభినందన



హరీశ్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న డీఆర్‌ఎం సీఎస్ గుప్తా

గుంతకల్లు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్‌లో అగ్ని ప్రమాదం విస్తరించకుండా చర్యలు తీసుకున్న పాయిట్స్‌మన్ హరీశ్‌ను డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా అభినందించారు. అనంతపురం జిల్లా గుంతకల్లులోని రైల్వే డివిజినల్ కార్యాలయానికి రప్పించుకుని, శుక్రవారం ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు. శాలువతో సన్మానించి, ప్రశంసాపత్రాన్ని, రివార్డును అందజేశారు. ఈ నెల 14న తిరుపతి స్టేషన్‌లో ఓ ఖాళీ బోగీలో మంటలు చెలరేగిన విషయం తెలిసిందే. దీన్ని గమనించిన పాయింట్స్‌మన్ హరీశ్, మంటలు వ్యాపించకుండా నిప్పంటుకున్న బోగీని ఇతర బోగీల నుంచి వేరుపరిచారు. రైల్వేకి ఆస్తి నష్టం జరక్కుండా సమయోచితంగా వ్యవహరించారు. ప్రమాదం జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండటమే కాకుండా ప్రాణాలకు తెగించి, ధైర్యసాహసాలను ప్రదర్శించారని డీఆర్‌ఎం అభినందించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

● రూ.67లక్షల విత్తనాలు, పురుగు మందుల సీజ్



ఓ ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో పురుగు మందుల పరిశీలన

వెంకటగిరి టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ నరసింహారావు హెచ్చరించారు. శుక్రవారం వెంకటగిరి డివిజన్ పరిధిలోని పలు దుకాణాల్లో ఆయన బృందం తనిఖీలు నిర్వహించింది. రైతులు తీసుకున్న ప్రతి వస్తువుకూ బిల్లు ఇవ్వడంతో పాటు రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. పూర్తిస్థాయిలో నమోదు చేయనందున రూ.21,99,979 విలువ గల ఎరువులు, రూ.45,19,240 పురుగు మందుల అమ్మకాలు నిలిపేశామన్నారు. ఓ రవాణా ట్రాన్స్‌పోర్టు కార్యాలయలో తనిఖీలు నిర్వహించి ఎటువంటి ఆధారాలు లేకుండా వచ్చిన పురుగు మందులు, విత్తనాలు పరిశీలించారు. నందాల, అంజనేయ, అనసూయ, ఏవో సుజాత, ప్రవీణ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

● రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసులో

వైసీపీ నేతను తప్పించేందుకు పైరవీలు

నాయుడుపేట టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసులో వైసీపీ నేతను తప్పించేందుకు ఆ పార్టీ నాయకులు జోరుగా పైరవీలు చేస్తున్నారు. ఈనెల 3వ తేదీ నాయుడుపేట - మల్లాం జంక్షన్ కూడలి వద్ద శ్రీకాళహస్తి నుంచి నెల్లూరుకు లారీలో అక్రమంగా తరలిస్తున్న 403 బస్తాల రేషన్ బియ్యాన్ని అర్బన్ సీఐ బాబి ఆధ్వర్యంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లారీ డ్రైవర్ గజేంద్రతో రేషన్ బియ్యం తరలింపులో వైసీపీ నాయకుడు పాత్ర ఉన్నట్లు తేలడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో సూళ్లూరుపేటకు చెందిన వైసీపీ నాయకులు శుక్రవారం రాత్రి పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని పోలీసులతో మంతనాలు ప్రారంభించారు. ఎలాగైనా కేసు నుంచి వైసీపీ నాయకుడిని తప్పించేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.

ఇద్దరు ఏపీపీల పదవీకాలం రద్దు

తిరుపతి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇద్దరు ఏపీపీల పదవీకాలాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. తిరుపతి అడిషినల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టుకు 2020 సెప్టెంబరు 9న న్యాయవాది సీహెచ్ శ్రీదేవి అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. ఆమె మూడేళ్ల పదవీ కాలం 2023 సెప్టెంబరులో ముగిసినా.. అదే ఏడాది నవంబరు నుంచీ కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే, శ్రీకాళహస్తి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టుకు గతేడాది మార్చి 15న న్యాయవాది సి.వీరరాఘవరెడ్డి అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. వీరిద్దరి పదవీ కాలాన్ని రద్దు చేయాలని రాష్ట్ర ప్రాసిక్యూషన్స్ విభాగం డైరెక్టర్ ప్రభుత్వానికి లేఖ రాశారు. దీంతో వారి పదవీ కాలాన్ని రద్దు చేస్తూ రాష్ట్ర హోమ్ శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.

● భర్త బావిలో తోసి చంపిన ఘటనలో

భార్యా బిడ్డలకు అంత్యక్రియలు పూర్తి

తలారివారిపల్లిలో అలుముకున్న విషాదఛాయలు



తల్లారివారిపల్లిలో బిడ్డల సహా హేమంతకుమారి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

కల్లూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా పాకాల మండలం మద్దినాయనిపల్లి పంచాయతీ పెద్దూరు హరిజనవాడకు చెందిన హేమంతకుమారి (35), ఇద్దరు బిడ్డలు తనుశ్రీ(11), తేజశ్రీ(8)లకు శుక్రవారం రాత్రి చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరు పంచాయతీ తలారివారిపల్లిలో అంత్యక్రియలు పూర్తిచేశారు. గురువారం మధ్యాహ్నం బంధువుల ఇంటికెళ్లొద్దామంటూ ద్విచక్రవాహనంపై భార్య, ఇద్దరు బిడ్డలను తీసుకెళ్లిన గిరి.. కోనేబోయిన ఇండ్లు సమీపంలోని బావిలో తోసేయడంతో ఆ ముగ్గురు మృతిచెందిన విషయం తెలిసిందే. తిరుపతి రుయాస్పత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించాక హేమంతకుమారి పుట్టిల్లయిన తలారివారిపల్లికు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. తల్లీబిడ్డల మృతదేహాలను ఒక్క సారిగా చూసిన గ్రామస్తులు బోరున విలపించారు. దీంతో గ్రామంలో విషాఛాయలు అలుముకున్నాయి.



కరకంబాడి - కపిలతీర్థం రోడ్డు ఏమైంది?

ఇక కపిలతీర్థం నుంచి కరకంబాడి వరకు గతంలో ప్రతిపాదించిన మార్గం ఇప్పటికీ అచరణలోకి రాలేదు. అటవీ అనుమతుల్లో జరుగుతున్న జాప్యమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఈరోడ్డును అందుబాటులోకి తీసుకొస్తే తిరుపతి నగరం మీద ట్రాఫిక్ ఒత్తిడి చాలా వరకూ తగ్గుతుంది.

పద్మవ్యూహంలా కపిలతీర్థం

● ట్రాఫిక్ కష్టాలు

● సీఎం గారూ మీరైనా దృష్టిపెట్టండి

తిరుపతి- ఆంధ్రజ్యోతి

అత్యంత పవిత్రమైన శైవక్షేత్రంగా తిరుపతిలోని కపిలతీర్థం ప్రసిద్ధి చెందుతోంది. కొండమీద నుంచి దూకే జలపాతం, విశాలమైన పుష్కరిణి, మండపాలతో కూడిన ఈ తీర్థం.. స్థానికులకే కాక, తిరుమలకు వచ్చిపోయే భక్తులనూ ఆకర్షిస్తోంది. వాహనాల్లో ప్రయాణించేవారు అక్కడ ఆగి కపిలేశ్వరుని దర్శించుకుని వెళ్తుంటారు. దీంతో నంది కూడలి అత్యంత రద్దీ ప్రాంతంగా మారిపోయింది. ట్రాఫిక్ జాం అన్నది ఇక్కడ సాధారణ విషయం అయ్యింది. సోమవారం రోజుల్లో అయితే ఈ సర్కిల్ దాటడం పెద్ద సమస్యగా మారుతోంది. దీనికి తోడు ఈ కూడలిలో తిరుపతి కార్పొరేషన్ పిలిగ్రిమ్ ఎమినిటీస్ సెంటర్ పేరుతో నిర్మించిన వాణిజ్యభవనం వద్ద నిలిచి పోయే వాహనాలతో మరింత గందరగోళం ఏర్పడుతోంది. నిబంధనలు పాటించని భవనాలపై చర్యలు తీసుకోవాల్సిన కార్పొరేషనే ఏకంగా ఏ నిబంధనలూ పాటించకుండా ఈ భవనాన్ని నిర్మించడం విచిత్రం. వైసీపీ పెద్దల అండదండలతో అప్పట్లో కోరినట్లు ఆ పార్టీ నేతలు నిర్మించుకున్న ఈ భవనం ఇప్పటికీ ఇదే తీరులో నడుస్తోంది. ట్రాఫిక్ కు మరింత ఇబ్బందిగా మారింది. నేడు కపిలతీర్థంను సందర్శిస్తున్న సీఎం చంద్రబాబు ఈ అంశంపై దృష్టి పెట్టాలని నగర ప్రజలు కోరుకుంటున్నారు.

నందిసర్కిల్ వరకు గరుడవారధి

గరుడ వారధి తొలుత అనుకున్న ప్రకారం నంది సర్కిల్ వరకు నిర్మించి ఉంటే ట్రాఫిక్‌కు పెద్ద అంతరాయం కలిగివుండదు. అయితే వైసీపీ ప్రభుత్వం దానిని కుదించేసింది. అలిపిరి పోలీస్ స్టేషన్ వరకే పరిమితం చేసింది. పైగా రూ220 కోట్ల బడ్జెట్‌తో అలిపిరి దాకా పొడిగిస్తామంటూ అప్పటి టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఏకండి డిజైన్ కూడా సిద్ధం చేయించారు. ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో వెనక్కి తగ్గారు. తొలి ప్లానింగ్ ప్రకారం కపిలతీర్థం దాటి మలుపుతిరిగేదాకా గరుడవారధిని పొడిగిస్తే తప్ప ఈ సమస్యకు పరిష్కారం లేదు.

కాలువలు కబ్జా

కొండమీద జల్లున పెద్ద వాన కురిస్తే చాలు కపిలతీర్థం, మాలాడగుండం జలపాతాలు ఉరకలేస్తూ దూకుతాయి. ఈ నీళ్లన్నీ వ్యర్థమవుతూ ఉంటాయి. అనేక చోట్ల ఆక్రమణలకు గురైపోయి ఇవి కుదించుకుపోయాయి. డ్రైజేజీతో కలిసిపోయి మురుగుకాలువలుగా ఈ రెండు కాలువలూ మారిపోయాయి. కపిలతీర్థం కాలువ అడుగున సిమెంటు లైనింగ్ వేసేయడంతో భూమిలోకి నీరు ఇంకకుండా జారిపోతోంది. ఇందువల్ల కాలువ తీర ప్రాంతాల్లోని భూగర్భజలాలు ఇంకిపోతున్నాయి. సిమెంట్ లైనింగ్ తొలగించాలని ప్రజలు కోరుతున్నా పట్టించుకోవడంలేదు.

ఎక్కడా ఏమరపాటు వద్దు

● సీఎం పర్యటనలో అప్రమత్తంగా ఉండాలంటూ ఎస్పీ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన రాజు

తిరుపతి(నేరవిభాగం), జూలై 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శనివారం సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా ఏమాత్రం ఏమరపాటు లేకుండా విధులు నిర్వహించాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. పోలీసు అధికారులు, సిబ్బందికి శుక్రవారం పోలీసు పరేడ్ మైదానంలో బందోబస్తు విధులు కేటాయించి మాట్లాడారు. చంద్రబాబు పర్యటించే అన్ని చోట్ల అప్రమత్తంగా ఉంటూ, ప్రశాంత వాతావరణంలో పర్యటన సాగేలా చూడాలన్నారు. ప్రతి పోలీసు వారికి కేటాయించిన స్థలాలకు శుక్రవారం సాయంత్రం చేరుకుని విధుల్లో నిమగ్నం కావాలన్నారు. ఇప్పటికే పోలీసు శాఖ రిహార్సిల్స్ నిర్వహించింది. ఎవరైనా సీఎం పర్యటనను అడ్డుకునేలా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. తిరుపతిలో అనుమానితులు దాదాపు 20 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఆరు గంటల పాటు తిరుపతిలో సాగనున్న సీఎం పర్యటనకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎం కాన్వాయ్‌లో కలెక్టర్‌తో పాటు ఎస్పీ, రిజర్వు బలగాలు ఉంటాయి. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకటరావు, కె.రవిమనోహరచారి, నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

బందోబస్తు ఇలా

నలుగురు అదనపు ఎస్పీలు, పది మంది డీఎస్పీలు, 41 మంది సీఐలు, 73 మంది ఎస్‌ఐ లు, 288 మంది ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 490 మంది కానిస్టేబుళ్లు, 86 మంది మహిళా కానిస్టేబుళ్లు, 153 మంది హోం గార్డులు.. మొత్తం 1149మంది పోలీసు సిబ్బంది బందోబస్తులో పాల్గొంటారు. వీరికి విధులు కేటాయించారు.

'ప్రజా వేదిక'కు సర్వం సిద్ధం

● వర్షం వచ్చినా తడవకుండా 2500 మందికి ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి అనగాని, కలెక్టర్ తదితరులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 18(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని పోలీసు పరేడ్ మైదానంలో శనివారం మధ్యాహ్నం సీఎం చంద్రబాబు నిర్వహించే ప్రజావేదికకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పీ4 కార్యక్రమం కింద దాతలుగా ముందుకు వచ్చిన మార్గదర్శులు, వారు దత్తత తీసుకునే బంగారు కుటుంబాలతో ముఖాముఖి సమావేశమవుతారు. ఈ కార్యక్రమంలో దాదాపు 2500 మంది పాల్గొంటున్నారు. భారీ వర్షం వచ్చినా తడవకుండా ఉండేలా రెయిన్ ప్రూఫ్ జర్మనీ టెంట్లు వేశారు. అక్కడే స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కింద ఆరు స్టాళ్లు ఏర్పాటు చేశారు. వచ్చిన వాళ్లందికీ తాగునీరు, బిస్కెట్లు, మజ్జిగ పంపిణీ చేయనున్నారు. మార్గదర్శుల్లో కొందరిని సీఎం సన్మానించనున్నారు. దాదాపు 1.45 గంటలపాటు జరగనున్న కార్యక్రమానికి సంబంధించి ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లను మంత్రి అనగాని సత్యప్రసాద్, సీఎం కార్యక్రమాల కో ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రహ్మణ్యం, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, కూటమి నాయకులు, కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ హర్షవర్ధనరాజు,కమిషనరు మౌర్య, ఆర్డీవో రామ్మోహన్‌రావు, అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచ్చారి, నాగభూషణరావు, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, జిల్లా అధికారులు పరిశీలించారు.



లక్ష్మీభారతి పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు, (ఇన్‌సెట్లో) లక్ష్మీభారతి ఫైల్ ఫొటో

చంద్రగిరి ఎమ్మెల్యే నానికి మాతృవియోగం

● పలువురు నాయకుల నివాళి

పాకాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానికి మాతృవియోగం కలిగింది. చిత్తూరులోని స్వగృహంలో శుక్రవారం ఉదయం నాని తల్లి లక్ష్మీభారతి(80) కన్నుమూశారు. కొద్దికాలంగా వృద్ధాప్య సంబంధ సమస్యలతో బాధపడుతున్నారు. పాకాల మండలం పులివర్తివారిపల్లెలో ఆమె పార్థివ దేహానికి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరిలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్ రెడ్డి, గాలి భానుప్రకాష్, డాక్టర్ మురళీమోహన్, ఆరణి శ్రీనివాసులు, థామస్, తుడా చెర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్ర రెడ్డి, డీసీసీబీ ఛైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి, డీసీఎంఎస్ ఛైర్మన్ సుబ్రమణ్యంనాయుడు, చంద్రగిరి ఏఎంసీ ఛైర్మన్ గౌస్‌బాషా, కిరణ్ రాయల్, సీకే లావణ్య, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. నాని కుటుంబ సభ్యులకు నాయకులు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తన తల్లి అంత్యక్రియలు శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు పులివర్తివారి పల్లెలో జరుగుతాయని ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు

● అధికారులకు ఎస్పీడీసీఎల్ సీఎండీ ఆదేశం



అధికారులతో సమీక్షిస్తున్న సీఎండీ సంతోషరావు

తిరుపతి(ఆటోనగర్), జూలై18(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని ఐదు ఉమ్మడి జిల్లాల్లో గృహ వినియోగదారులకు, రైతులకు, పారిశ్రామికవేత్తలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా క్షేత్రస్థాయిలో పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సంస్థ సీఎండీ కె.సంతోషరావు ఆదేశించారు. తిరుపతిలోని అనెక్స్ భవనంలోని సమావేశ మందిరంలో అన్ని జిల్లాల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. పీఎం సూర్యఘర్ పథకంపై వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో వేగం పెంచాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరు మెరుగుపరచాలని సూచించారు. పొలాల్లో మరమ్మతులకు గురైన విద్యుత్ స్తంభాలను తొలగించాలని ఆదేశించారు. పెండింగ్ వర్క్ ఆర్డర్లు క్లోజ్ చేయని వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సరఫరాలో అంతరాయం ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1912కి లేదా 1800 425155333, 9133331912లకు ఫిర్యాదు చేయాలని వినియోగదారులకు సూచించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు కె.గురవయ్య, పి.అయూబ్‌ఖాన్, సీజీఎంలు జె.రమణాదేవి, కె.ఆర్.ఎస్.ధర్మజ్ఞాని, డీఎస్ వరకుమార్, పి.హెచ్.జానకిరామ్, ఆదిశేషయ్య, శోభావాలంటీనా, కె.రామమోహన్‌రావు, పి.మురళి, జీఎంలు ఎం.కృష్ణారెడ్డి, నీలం నరేంద్రనాథ్, శ్రీనివాసులు, సురేంద్రనాథ్, మురళి, చక్రపాణి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

స్మార్ట్ ఉపగ్రహ తయారీ వర్క్‌షాప్



స్మార్ట్ ఉపగ్రహాలు తయారు చేస్తున్న విద్యార్థులు



మంగళం, జూలై 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి రీజనల్ సైన్స్ సెంటర్‌లో చెన్నైకి చెందిన స్పేస్ కిడ్ ఇండియా వారి సహకారంతో శుక్రవారం విద్యార్థులకు స్మార్ట్ ఉపగ్రహ తయారీపై వర్క్‌షాప్ నిర్వహించారు. 23 పాఠశాలలకు చెందిన 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. స్మార్ట్ ఉపగ్రహాలు తయారు చేశారు. సైన్స్ సెంటర్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ నెహ్రూ మాట్లాడుతూ అపోలో లావెల్ మిషన్ ద్వారా మనుషులు మొదటిసారి చంద్రుడిపైకి అడుగు పెట్టారన్నారు. ఈ సందర్భాన్ని గుర్తు చేసుకుటూ వారం రోజులు విద్యార్థులకు ఉపగ్రహంపై వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్పేస్ కిడ్ ఇండియా ప్రాజెక్టు ఇన్‌ఛార్జి యజ్ఞసాయి ఉపగ్రహం తయారీ, పనితీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సైన్స్‌సెంటర్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ పురుషోత్తం, స్పేస్ కిడ్ ఇండియా మేనేజరు హాసిక పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై మహిళా కమిషన్‌కు రోజా ఫిర్యాదు

పుత్తూరు,జూలై18(ఆంధ్రజ్యోతి): తన వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ పలు సందర్భాల్లో అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే భానుప్రకాష్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ మంత్రి రోజా రాష్ట్ర మహిళా కమిషన్‌కు శుక్రవారం మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. భాను చేసిన వ్యాఖ్యలను ఉటంకించారు. ఎమ్మెల్యే పదవిలో ఉండీ, ఇలా మాట్లాడుతున్న భానుప్రకాష్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

టీటీడీలో క్రైస్తవ ఉద్యోగిని తొలగించాలంటూ ఫిర్యాదు



చర్చిలో కన్నిగ (ఓంకార్ విడుదల చేసిన చిత్రమిది)

తిరుమల, జూలై18(ఆంధ్రజ్యోతి): టీటీడీలో క్రైస్తవ ఉద్యోగిని కన్నిగను తక్షణమే విధుల నుంచి తొలగించాలని తిరుక్షేత్రాల రక్షణ సమితి స్టేట్ ప్రెసిడెంట్ తుమ్మా ఓంకార్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. టీటీడీ విద్యుత్ విభాగం ఏఈ కన్నిగ ప్రతి ఆదివారం ఎస్వీ నగర్ చర్చిలో బైబిల్ తరగతులు చెబుతున్నారంటూ, ఆమె ప్రార్థన చేసిన వీడియోతో శుక్రవారం టీటీడీ ఈవో కార్యాలయంలో ఫిర్యాదు చేశామన్నారు. ప్రతి ఆదివారం చర్చిలో బైబిల్ క్లాసులు బోధిస్తున్న వీడియోను 2019లోనే టీటీడీకి అందజేసినా ఇప్పటివరకు పట్టించుకోలేదన్నారు. ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, శాశ్వతంగా టీటీడీ నుంచి బహిష్కరించాలని డిమాండు చేశారు. ఈ మేరకు ఆమె చర్చిలో ఉన్న ఫొటోనూ ఓంకార్ విడుదల చేశారు.

ఏఎంసీ పదవుల్లో మహిళలకు పెద్దపీట


ప్రమీల, నీరజ

గూడూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) ఛైర్మన్లను నియమిస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో గూడూరు నియోజకవర్గ పరిధిలోని వాకాడు, చిల్లకూరు ఏఎంసీ ఛైర్ పర్సన్లుగా మహిళలను నియమించారు. పార్టీ విధేయులకు పట్టం కట్టడంతో టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. మండల కేంద్రమైన చిల్లకూరు గ్రామానికి చెందిన చిల్లకూరు నీరజ భర్త పట్టాభిరామిరెడ్డి టీడీపీ సీనియర్ నాయకుడైన కొండేపాటి గంగాప్రసాద్‌కు ముఖ్య అనుచరుడు. పట్టాభిరామిరెడ్డి గతంలో చిల్లకూరు పీఏసీఎస్ అధ్యక్షుడిగా పనిచేశారు. అతని భార్య నీరజ 2006 నుంచి 2011 వరకు చిల్లకూరు సర్పంచుగా వ్యవహరించారు. మండలంలో టీడీపీ పటిష్ఠతకు ఎంతగానో కృషి చేస్తున్న పట్టాభిరామిరెడ్డి పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా వ్యవహరిస్తూ కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. వీరి సేవలను గుర్తించిన టీడీపీ అధిష్ఠానం జనరల్ మహిళ కోటాలో గూడూరు ఏఎంసీ ఛైర్‌పర్సన్‌గా నీరజను నియమించారు. వాకాడు మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా మండల కేంద్రమైన కోట గ్రామానికి చెందిన టీడీపీ నేత, ఎంపీటీసీ దారా సురేష్ సతీమణి మర్రి ప్రమీలను రాష్ట్ర ప్రభుత్వం నియమిచింది. పదో తరగతి వరకు చదువుకున్న ప్రమీల పంచాయతీ 11వ వార్డు సభ్యురాలు. అలాగే కోట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సభ్యురాలుగా వ్యవహరిస్తున్నారు. ఈమె భర్త దారా సురేష్ రెండో పర్యాయం ఎంపీటీసీగా కొనసాగుతున్నారు. మండలంలో టీడీపీ పటిష్ఠతకు సురేష్ కృషి చేస్తున్నారు. మహిళా కోటాలో వాకాడు ఏఎంసీ ఛైర్‌పర్సన్‌గా ప్రమీలను నియమించింది.

విధేయతకు అందలం


ఆకుతోట రమేష్

తడ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వీరాభిమాని స్థాయి నుంచి సామాన్య కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించిన ఆకుతోట రమేష్‌కు అధిష్ఠానం ఇన్నేళ్లకు సముచితస్థానం కల్పించింది. డిగ్రీ పట్టభద్రుడైన ఆకుతోట రమేష్ ఎన్టీఆర్‌పై అభిమానంతో 1984 నుంచి టీడీపీ కార్యకర్త. అప్పటి పంచాయతీ వార్డు మెంబరు పోకల రమణయ్య అనుచరుడిగా ప్రస్థానం ప్రారంభించి వేనాటి కుటుంబానికి దగ్గరయ్యారు. 1994లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో తొలిసారిగా వార్డు సభ్యుడిగా గెలుపొందారు. 2017లో చెంగాళమ్మ ట్రస్టుబోర్డు సభ్యుడిగా నియమితులయ్యారు. 2019 - 24 మధ్య అప్పటి వైసీపీ ప్రభుత్వ అవినీతి, ఆ పార్టీ నేతల అరాచకాలపై పోరాడారు. బెదిరింపులు, ప్రలోభాలు ఎదురైనా వెనక్కు తగ్గలేదు. 2023లో చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో పట్టణంలో ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలను నిర్వహించారు. 2024 ఎన్నికల్లో సూళ్లూరుపేట పట్టణంలో టీడీపీకి సుమారు 9వేలకు పైగా మెజార్టీ రావడానికి రమేష్ ఎంతో కృషి చేశారు. ఆయన విధేతయ, పనితీరును గుర్తించి సూళ్లూరుపేట ఏఎంసీ ఛైర్మన్‌గా నియమించడం పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది.

కృషికి గుర్తింపు


విశ్వనాథ నాయుడు

వెంకటగిరి, జులై 18 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ప్రముఖ పారిశ్రామిక వేత్త కొండేపాటి గంగాప్రసాద్‌కు ముఖ్య అనుచరుడైన పునుగోటి విశ్వనాథ నాయుడు టీడీపీలో క్రియాశీల నేత. 2014లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 22వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా విజయం సాధించారు. వార్డు అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేశారు. తిరుపతి పార్లమెంటు వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా పనిచేశారు. అలాగే గ్రామశక్తి పోలేరమ్మ దేవస్థానం పాలకవర్గం సభ్యుడిగా సేవలందించారు. ఎన్నికలకు ముందు నారా లోకేశ్ నిర్వహించిన యువగళం పాదయాత్రలో 60రోజుల పాటు పాల్గొన్నారు. మొదటి నుంచి విధేయుడుగా ఉండడంతో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేసిన పునుగోటి విశ్వనాథ నాయుడిని తాజాగా నామినేటెడ్ పదవి వరించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎంసీ ఛైర్మన్‌గా నియమితులవడంతో తన బాధ్యత మరింత పెరిగిందని, మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. తనకు పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, పారిశ్రామిక వేత్త కొండేపాటి గంగాప్రసాద్‌కు కృతజ్ఞలు తెలిపారు.

అభిమానికి అవకాశం


ఉయ్యాల ప్రవీణ్

తడ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మొదటి నుంచి పవన్ కల్యాణ్ అభిమాని అయిన ఉయ్యాల ప్రవీణ్ జనసేన ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నారు. 2014లో కూటమి తరఫున విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇది గుర్తించిన పవన్ కల్యాణ్ 2019లో సూళ్లూరుపేట నియోజవర్గ జనసేన అభ్యర్థిగా ఎన్నికల్లో అవకాశం ఇచ్చారు. వైసీపీ హయాంలో ప్రభుత్వ అరాచకాలకు వ్యతిరేకంగా టీడీపీతో కలసి పోరాటాలు చేశారు. 2024 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీ గెలుపు కోసం కష్టపడి పనిచేశారు. దీంతో నాయుడుపేట ఏఎంసీ ఛైర్మన్‌గా నియమించారు.

విధుల్లో నిరక్ష్యం వహిస్తే చర్యలు: డీఎల్పీవో

దక్కిలి, జులై 18 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు విధుల్లో నిరక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని గూడూరు డీఎల్పీవో వాణిరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం దక్కిలికి వచ్చిన మండల పరిషత్ కార్యాలయంలలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ఫిర్యాదులు వస్తే సంబంధిత కార్యదర్శిపై చర్యలు తీసుకొంటామని చెప్పారు. గ్రామాల్లో పాఠశాలలు, గుడులు, జనసంచార ప్రదేశాల్లో పేడదిబ్బలను తొలిగించాలని చెప్పారు. వీధి దీపాలు, తాగునీటి సమస్యపై దృష్టి పెట్టాలన్నారు. అలాగే ఇంటి పన్ను సకాలంలో వసూలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గుణశేఖరరెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశం


అధ్యాపకులు, కరస్పాండెంట్ రామ్‌కుమార్‌రెడ్డితో పూర్వ విద్యార్థులు

కోట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం పూర్వ విద్యార్థుల సమావేశం జరిగింది. కరస్పాండెంట్ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. 1996-2000లో ఇంజనీరింగ్ చదివిన విద్యార్థులంతా కలుసుకుని ఉల్లాసంగా గడిపారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, నాటి అధ్యాపకులను శాలువాలు, మెమోంటోలతో సత్కరించారు.

చెంగాళమ్మ సేవలో ఎమ్మెల్యే కురుగొండ్ల

సూళ్లూరుపేట, జులై 18 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరిని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. అలాగే పెంచలకోన ఆలయ మాజీ ట్రస్టుబోర్డు ఛైర్మన్ నానంకి నానాజీ దంపతులు కూడా అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం చేసి అమ్మవారి తీర్థప్రసా దాలు అందజేశారు. టీడీపీ నేతలు లోకేష్ నాయుడు, సురేష్ నాయుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.


కురుగొండ్ల దంపతులకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేస్తున్న దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి

స్థానిక సంస్థలకు ప్రాధాన్యం

- గత ప్రభుత్వంలా నిధులు లాక్కోలేదు
- రూ.62.22 కోట్లు జమ చేశాం!
- గతంలో జడ్పీటీసీలు ఎందుకు ప్రశ్నించలేదు?
- జడ్పీ సర్వసభ్య సమావేశంలో మంత్రి ఆనం

నెల్లూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): 'గత పాలన తీరు వేరు. కూటమి పాలన వేరు. తమ ప్రభుత్వం స్థానిక సంస్థలకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. గతంలోలా పంచాయతీల నిధులను లాగేసుకోవడం లేదు. ఏడాది కాలంలో జిల్లాలో స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన రూ.62.22 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం నేరుగా స్థానిక సంస్థల ఖాతాల్లో జమ చేసింది' అని దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన శుక్రవారం నెల్లూరులోని జడ్పీ సమావేశ మందిరంలో జరిగింది. ముందుగా జడ్పీ మాజీ ఛైర్మన్ బాలచెన్నయ్య మృతికి సంతాపం ప్రకటించారు. అనంతరం అరుణమ్మ సమావేశాన్ని ప్రారంభించగా, పంచాయతీ రాజ్, డ్వామా, డీఆర్‌డీఏ, విద్యా, విద్యుత్ శాఖలపై సమీక్ష జరిగింది. పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు తమ ప్రాంతాల్లోని సమస్యలను ప్రస్తావించారు. 30 నెలలుగా గౌరవ వేతనం ఇవ్వలేదని, జడ్పీ జనరల్ ఫండ్ కింద ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యేలు కూడా పలు అంశాలపై మాట్లాడటంతో వాటిని పరిష్కరించాలని మంత్రి, కలెక్టర్ జిల్లా అధికారులను ఆదేశించారు. చివరగా మంత్రి ఆనం మాట్లాడుతూ.. గౌరవ వేతనాన్ని జనరల్ ఫండ్ కింద చెల్లించి, తిరిగి రీయింబర్స్ చేసుకునే అవకాశం ఉన్నా జడ్పీ అధికారులు ఎందుకు అలా చేయలేదని ప్రశ్నించారు. ఇప్పుడు గౌరవ వేతనం గురించి మాట్లాడుతున్న జడ్పీటీసీలు.. గత ప్రభుత్వంలో సర్పంచుల నిధులు, అధికారాలు లాగేసుకున్నప్పుడు ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. తాము స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని అనుకుంటే, వారికి సమాధానం కూడా అంతే కరుగ్గా వస్తుందని ఆనం వ్యాఖ్యానించారు. జిల్లా స్థాయి సమావేశాలకు అధికారులు సమగ్ర సమాచారంతో రావాలని, ఇకపై అలా రాకపోతే ఉపేక్షించేది లేదని కలెక్టర్‌కు సూచించారు. గత ప్రభుత్వ పుణ్యమా అంటూ రాష్ట్రంలో జలజీవన్ మిషన్ పనులు రద్దయ్యే ప్రమాదం వచ్చిందని, కానీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో మాట్లాడి మరో రెండేళ్ల సమయం పొడగించుకున్నారని మంత్రి వెల్లడించారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పక్కన జడ్పీ ఛైర్‌పర్సన్ అరుణమ్మ, కలెక్టర్ ఆనంద్, తదితరులు

నిధులు ఇవ్వాల్సిందే..

గతంలో వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి, సైదాపురం మండలాల్లో శిథిలావస్థలో ఉన్న ఎంపీడీవో కార్యాలయాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించేందుకు జడ్పీ నిధులు మంజూరు చేశారని, వాటిలో కొన్ని అసంపూర్తిగా ఉన్నాయని ఆయా జడ్పీటీసీ సభ్యులు ప్రస్తావించారు. మిగిలిన నిధులు మంజూరు చేస్తే భవనాలు పూర్తవుతాయని కోరారు. కానీ వీరి విన్నపాన్ని ఛైర్‌పర్సన్ అరుణమ్మ తిరస్కరించారు. నిధులు ఇవ్వడం సాధ్యం కాదని తేల్చి చెప్పారు. అయితే నిధులు ఇవ్వలేం అనడం.. సరైన సమాధానం కాదని మంత్రి ఆనం అన్నారు. పెండింగ్ నిధులను విడుదల చేయాలని ఆదేశించారు. అలానే ఇంతకాలం ఆ భవనాలను ఎందుకు పూర్తి చేయలేకపోయారో కలెక్టర్‌కు వివరణ పంపాలని జడ్పీ సీఈవోకు సూచించారు.

ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: పాశిం


రాఘువారిపాళెంలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్ కుమార్

చిట్టమూరు, జులై 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో లాగా అధికారులు ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో జరిగింది. అరవపాళెం, బయ్యవారి కండ్రిగ, ఆరూరు, రాఘువారిపాళెం గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. అరవపాళెంలో రూ.10లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్‌ను ప్రారంభించారు. అరవపాళెం ఉన్నత పాఠశాల సమీపంలో ప్రధాన రహదారి దాటాలంటే ఇబ్బందిగా ఉందని, స్పీడ్ బ్రేకర్లు వేయించాలని, అలాగే మెయిన్ రోడ్ నుంచి స్కూల్ వరకు రోడ్డు వేయించాలని విద్యార్థులు ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులుకు ఫోన్ చేసి తక్షణం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే ఆరూరులో రూ.2 లక్షలతో ఏర్పాటు చేసిన తాగునీటి బోరు, రాఘువారిపాళెం గ్రామంలో రూ.5లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్‌ను ప్రారంభించారు. రాఘువారిపాళెం గ్రామానికి చెందిన మహిళల కోరిక మేరకు సిమెంట్ రోడ్లకు మరో రూ.10లక్షలు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామాల్లో తాగు, సాగునీటి సమస్య ఉత్పన్నవుతోందని, అధికారులు మారాలని లేని పక్షంలో చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అనంతరం అంగనవాడీ టీచర్ ఉక్కు సుమతి ఆధ్వర్యంలో జరిగిన సామూహిక సీమంతం కార్యక్రమంలో పాల్గొని గర్భిణులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో సర్పంచులు నల్లారెడ్డి రాజేష్‌రెడ్డి, కాకి చెంగమ్మ, ఎంపీడీవో మనోహర్ గౌడ్, తహసీల్దారు సతీష్ కుమార్, నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు శివకోటరెడ్డి, గోపాల్‌రెడ్డి, మస్తాన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు శరత్‌చంద్రారెడ్డి, గిరి నాయుడు, దేవుడు, ముత్తురాజా, శివారెడ్డి, కాపులూరు చెంచురామయ్య ఆచారి, వెంకటరమణయ్య, సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ర్యాక్‌ల వితరణ

గూడూరు అర్బన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక దివిపాళెంలోని ప్రాథమికోన్నత పాఠశాలకు శుక్రవారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో కొణిదల మునిగిరీష్, మునిభాస్కర్ దాతృత్వంతో స్టేషనరి ర్యాక్‌లను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ సభ్యులు మాట్లాడుతూ మునిరామయ్య వర్ధంతిని పురస్కరించుకుని వారి కుటుంసభ్యులు పాఠశాలకు ర్యాక్‌లను అందించారని తెలిపారు. కార్యక్ర మంలో మునిగిరీష్, వెంకటేశ్వర్లురెడ్డి, మల్లు విజయ్ కుమార్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, మునిభాస్కర్, మోహన్‌దాస్, కుమార్, బాలకృష్ణంరాజు, శ్రీధర్‌రెడ్డి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

హోంమంత్రి అనితకు సన్మానం


హోంమంత్రి అనితను సన్మానిస్తున్న తెలుగు మహిళా నేతలు

గూడూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): హోంమంత్రి అనితను గూడూరు నియోజకవర్గానికి చెందిన తెలుగు మహిళా నేతలు సన్మానించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన తెలుగు మహిళా ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న అనితను తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి, గుండాల లీలావతి, దువ్వూరు భారతి తదితరులు మొక్క అందజేసి శాలువతో సత్కరించారు.

కారును ఢీకొన్న టిప్పరు

చిల్లకూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరు పోలీస్‌స్టేషన్ సమీపంలో శుక్రవారం కారును టిప్పరు ఢీకొంది. పోలీసుల వివరాల మేరకు... మదనపల్లి నుంచి జోన్నవాడ వెళుతున్న కారును టిప్పరు అదుపుతప్పి వెనుక నుంచి ఢీకొంది. దీంతో కారు డీవైడర్‌ను ఢీకొనడంతో ముందుభాగం దెబ్బతినింది. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి గాయాలు కాలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నారాయణమ్మకు ప్రత్యేక పూజలు

గూడూరు, జులై 18(ఆంధ్రజ్యోతి): స్థానిక సొసైటీ కాలనీలోని నారాయణమ్మ పేరంట్రాళ్ల ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాడమాసం సందర్భంగా అమ్మవారిని శాకంబరిగా అలంకరించి పూజలు జరిపారు. ఆలయాన్ని వివిధ రకాల కూరగాయలతో ముస్తాబు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు.

ఆకుతోటకు నేతల సత్కారం


ఆకుతోట రమేష్ సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట. జూలై 18 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఏఎంసీ ఛైర్మన్‌గా నియమితులైన ఆకుతోట రమేష్‌ను శుక్రవారం సూళ్లూరుపేట మండల టీడీపీ అధ్యక్షుడు కొక్కు శంకరయ్య, నాయకులు గురుకల సుబ్రహ్మణ్యం, గురుకల కృష్ణయ్య, గొంజి వెంకటేశ్వర్లు సత్కరించారు.

23న ఉచిత వైద్యశిబిరం

గూడూరు అర్బన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఈనెల 23వ తేదీన లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మెహబూబ్‌బాషా శుక్రవారం తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయంలో వైద్యశిబిరం

వాకాడు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. తహసీల్దారు రామయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు, ఆర్ఐ అఖిల్, ఈవోపీఆర్‌డీ ఉమామహేశ్వరరావు, సిబ్బంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

గేదెను ఢీకొన్న బైక్

యువకుడికి తీవ్ర గాయాలు

కోట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు సమీపంలో ఉన్న రొయ్యల పరిశమ వద్ద శుక్రవారం గేదెను మోటరు బైక్ ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు... తిమ్మానాయుడుపాళెం గ్రామానికి చెందిన వరప్రసాద్ మోటరు బైక్‌లో కోట నుంచి గూడూరు వైపు వెళ్తుండగా చిట్టేడు రొయ్యల పరిశ్రమ వద్ద రోడ్డుపై వెళ్తున్న గేదెను ఢీకొట్టి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వరప్రసాద్‌ను స్థానికులు 108 వాహనంలో గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబసభ్యులు మెరుగైన చికిత్స కోసం నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూళ్లూరుపేట, జూలై 18(ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ ఆలయ సమీపంలో ఉన్న సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణంలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ మోహిని తెలిపారు.

సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె

గూడూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని సీఐటీయూ నాయకులు స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె కొనసాగించారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, శివకుమార్, బీవీ రమణయ్య, మణి, రమణయ్య, పోలయ్య, సుబ్బారావు, వరలక్ష్మి, మునెమ్మ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి రుద్రాభిషేకం

గూడూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠంలో శుక్రవారం ఆంజనేయ స్వామికి పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి పాశుపత మహా రుద్రాభిషేకం, విశేష పూజలు చేశారు.

నల్లబ్యాడ్జీలతో మున్సిపల్ కార్మికుల ధర్నా

సూళ్లూరుపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలంటూ సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. తమ డిమాండ్లను అంగీకరించి సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులకు సీఐటీయూ నాయకులు లక్ష్మయ్య, ఎస్కే రియాజ్, సాంబశివయ్య తదితరులు మద్దతు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం


అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

నాయుడుపేట టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి సీఐటీయూ, మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ముకుంద, అంగన్‌వాడీ ప్రాజెక్టు అధ్యక్షురాలు శ్యామలమ్మ, వర్కర్స్ యూనియన్ నాయకులు శీనయ్య, నాగరాజు, రామచంద్రయ్య, కాలేషా, తదితరులు పాల్గొన్నారు.

అసమానతల తగ్గింపే పీ-4 లక్ష్యం

నాయుడుపేట టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్థిక అసమానతలను తగ్గించడమే పీ-4 లక్ష్యమని మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో పీ-4పై ప్రజాభిప్రాయ సేకరణ, శంభురాపురం, గెరిడీవీధి సచివాలయ పరిధిలోని వార్డుసభలు నిర్వహించారు.


పట్టువస్త్రాలను తీసుకువెళ్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ దంపతులు

శాకాంబరిగా చెంగాళమ్మ



సూళ్లూరుపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరి శుక్రవారం శాకాంబరి దేవిగా భక్తులకు దర్శన మిచ్చారు. ఆషాడ మాసాన్ని పురష్కరించుకుని రకరకాల పండ్లు, కూరగాయలతో అమ్మవారి మూల విరాట్‌ను అలంకరించారు. ఆలయం లోపల అమ్మవారి సన్నిధిలో కూడా పండ్లు, కూరగాయలతో పందిళ్ల వేసి సుందరంగా అలంకరించారు. అనంతరం వేదపండితులు, మంత్రోచ్ఛరణల ప్రత్యేక పూజలు వేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పార్థసారధి దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వారికి దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజలనంతరం వేదపండితులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అంద జేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్,నాయకులు చిట్టేటి పెరుమాల్, ఏలిమేటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మేనకూరు సెజ్‌లో రూ.1800 కోట్లతో భారీ పరిశ్రమ ఏర్పాటుకు సన్నాహాలు

నాయుడుపేట/టౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం మేనకూరు సెజ్‌లో రూ.1800 కోట్లతో భారీ పరిశ్రమ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మన దేశానికి చెందిన సైర్మ ఎస్‌జీఎస్ లిమిటెడ్ కంపెనీ, సౌత్ కొరియాకు చెందిన షైనీఆప్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ సంయుక్తంగా భారీ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమను ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ఈ కంపెనీలు ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డులు (పిసిబి), కాపర్ క్లాడ్ లామినెట్స్ (సిసిఎల్) ఉత్పత్తులను తయారు చేస్తాయి. వచ్చే ఆర్థిక నుంచి పరిశ్రమ పనులు ప్రారంభంకానున్నట్లు సమాచారం.

నిర్వాసితులకు న్యాయం చేస్తాం: ఆర్డీవో


నిర్వాసితులతో మాట్లాడుతున్న ఆర్డీవో కిరణ్మయి

పెళ్లకూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకూరు గ్రామంలో జాతీయ రహదారి విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి న్యాయం చేస్తామని సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి అన్నారు. శుక్రవారం చిల్లకూరు గ్రామంలో జాతీయ రహదారి విస్తరణలో ఇళ్లు కోల్పోయి మెరిమి సుబ్బారావు, చింత పూడి కాటరాజుతో ఆర్డీ మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ ఇదే గ్రామంలో రహదారి విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారందరికీ రెట్టింపు పరిహారం అందజేశారని, సెంటు భూమిలేని తమకు మాత్రం తక్కువ పరిహారం ఇస్తామనడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్డీవో స్పందిస్తూ ఇంటి స్థలం పంచాయతీ పోరంబోకు కాబట్టి ఇంటికి మాత్రమే నష్టపరిహారం ఇస్తామని, ప్రభుత్వ నింబంధనల మేరకు అన్ని విధాలా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికృష్ణ, మండల సర్వేయర్ సుప్రజ, వీఆర్వో వంశీకృష్ణ, సచివాలయ సర్వేయర్ లక్ష్మణ్, వీఆర్ఏ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంత దూరం పిల్లలను పంపలేం


విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవో బాబయ్య

వెంకటగిరి టౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాళెంకోట ప్రాథమిక పాఠశాలలోని 3,4 తరగతులను మొక్కలపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో విలీనం చేశారు. తమ పిల్లలను మొక్కలపాడు ప్రాథమికోన్నత పాఠశాలకు పంపేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు అభ్యంతరం తెలిపారు. దీంతో శుక్రవారం పీడీఎస్‌వో నాయకులు, ఎంఈవో బాబయ్య పాళెంకోట గ్రామానికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. మొక్కలపాడుకు పిల్లలను పంపించడంలో ఉన్న ఇబ్బందులను తల్లిదండ్రులు ఎంఈవో దృష్టికి తీసుకెళ్లారు. పాళెంకోట నుంచి మొక్కలపాడుకు నాలుగు కిలోమీటర్లు ఉందని, వర్షాకాలంలో గొడ్డేరు వాగు ప్రవహిస్తే ఇబ్బందులు వస్తాయన్నారు. అటవీ మార్గంలో కావడంతో అడవి పందులు, ఎలుగుబంట్లు తిరుగుతుంటాయన్నారు. పాళెంకోట ప్రాథమిక పాఠశాలలోనే 3,4 తరగతులను కొనసాగించాలని కోరారు. లేదంటే పిల్లల చదువు మానిపించస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌వో నాయకుడు పవన్, గ్రామ సర్పంచి వేణుగోపాల్ రెడ్డి, తిరుపాల్ పాల్గొన్నారు.